ఆంధ్రకేసరీ.. ఏంటీ దోపిడీ!

▶ విద్యార్థులకు భారంగా రుసుములు ▶ అధికారుల నిర్ణయాలపై విమర్శలు



ఒంగోలు నగరం, న్యూస్‌టుడే:

ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం(ఏకేయూ) అధికారుల తీరు.. నిర్ణయాలు పేద విద్యార్థుల పాలిట భారంగా మారుతున్నాయి. ఇష్టారీతిన రుసుములు నిర్ణయించి వసూలు చేస్తున్నారు. ఈ ఏకపక్ష ధోరణిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనారోగ్యం, ఇతరత్రా అనివార్య కారణాలతో రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలను కొందరు విద్యార్థులు రాయలేకపోయారు. ఇటువంటి వారు మూడో సెమిస్టర్ పరీక్షలకు హాజరు కావాలంటే రూ.5 వేలు చెల్లించాలని విశ్వవిద్యాలయం అధికారులు నిర్ణయించారు. వాస్తవానికి ఇతర జిల్లాల యూనివర్సిటీల్లో ఈ ఫీజు రూ.2,200గా ఉంది. ఇక్కడ మాత్రం అంతకు రెట్టింపు వసూలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే పరీక్షల నిర్వహణకు సంబంధించి సమాధానాలు రాసే బుక్‌లెట్లను యూనివర్సిటీ అధికారులే ఆయా కళాశాలలకు అందజేయాల్సి ఉంటుంది. ఇక్కడ కూడా అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. బుక్‌లెట్‌లు ఇవ్వకపోగా ఆ పేరుతో డబ్బులు వసూలు చేస్తుండటం గమనార్హం. పైగా కళాశాలకు ఒకటి చొప్పున ఇచ్చి ఆయా కళాశాలల్లోనే జిరాక్స్ తీసుకొని దానికి తెల్ల కాగితాలు కలిపి విద్యార్థులకు అందజేయాలని సూచిస్తుండటం హాస్యాస్పదంగా మారింది. ఈ తీరుపై కళాశాల యాజమాన్యాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సొంత డబ్బులు ఖర్చు పెట్టి బుక్‌లెట్‌లు ఇవ్వాల్సి రావడంతో కొన్ని కళాశాలలు ఆ భారాన్ని తిరిగి విద్యార్థులపై మోపుతున్నారు.

మా చేతులు కాలాయి.. మీరిక ఆకులు పట్టుకోండి!

▶ మద్యం కుంభకోణంపై ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యం

▶ అంతర్గత విచారణంటూ అంతులేని జాప్యం ▶ ఎట్టకేలకు పోలీసుల చెంతకు కేసు పర్వం

ఒంగోలు, న్యూస్‌టుడే:

తర్జనభర్జనలు.. మధ్యవర్తిత్వాలు.. అంతర్గత విచారణంటూ సాగదీతలు.. చివరికి అజ్ఞాతంలోకి వెళ్లిన నిందితులు.. ఈ పరిణామాల మధ్య ఒంగోలు మద్యం కుంభకోణం కేసు ఎట్టకేలకు పోలీసుల వద్దకు చేరింది. వైకాపా ప్రభుత్వ హయాంలో ఒంగోలులోని ప్రభుత్వ మద్యం దుకాణాలు, ఎలైట్ మాల్స్‌లో భారీ కుంభకోణం చోటు చేసుకుంది. పెద్దఎత్తున నిధులు దుర్వినియోగమయ్యాయి. ఈ విషయం ఈ నెల 15వ తేదీనే వెలుగుచూసింది. తమ వద్ద నుంచి అమ్మకాలకు సంబంధించిన డబ్బును సదరు మాల్స్, దుకాణాల పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్న కానిస్టేబుల్ మార్నేని రమణ తీసుకున్నారని. తిరిగి వెనక్కు ఇవ్వలేదంటూ జిల్లా ఎస్పీ ఏఆర్. దామోదర్‌ను కలిసి మంగమ్మ కళాశాల సమీపంలోని మాల్ సిబ్బంది ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే విచారణకు ఆదేశించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుల్ రమణతో పాటు మాల్స్ సిబ్బందిని తాలూకా సీఐ కె.అజయ్ కుమార్ స్టేషన్‌కు పిలిపించి విచారించారు. ఎక్సైజ్ సీఐ నుంచీ వివరాలు రాబట్టారు. ఇంతవరకు బాగానే ఉంది. ఆ తర్వాతే కథ మొత్తం మారిపోయింది.



▶ **అప్పుడే ఫిర్యాదు చేసి ఉంటేనో..!:** అదేరోజు పోలీసులకు ఎక్సైజ్ శాఖ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. నిందితులు అందరూ అక్కడే పట్టుబడేవారు. ఎక్సైజ్ అధికారులు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. అసలు ఎంతమొత్తం గోల్‌మాల్ అయ్యిందనే విషయాన్ని గుర్తించేందుకు అంతర్గత విచారణ చేస్తామనీ, ఆ తర్వాత ఫిర్యాదు చేస్తామని చెప్పారు. దీంతో పోలీసు విచారణ నిలిచిపోయింది. ఇదే అదనుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుల్ మార్నేని రమణ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతని ఫోన్లు మూగబోయాయి. దీంతో నగరంలోని రెండు మాల్స్ సిబ్బందిని పిలిపించి విచారించటం మొదలుపెట్టారు.

▶ **సొత్తు చెల్లింపునకు తూచ్ అనడంతో...:** తొలుత రూ.అయిదు కోట్ల మేర గోల్‌మాల్ అయినట్లు భావించారు. చివరికి ఆ మొత్తాన్ని రూ.2.45 కోట్లుగా తేల్చారు. ఈ సొత్తు రికవరీ చేసేందుకు కొందరు అధికారులు నానాపాట్లు పడ్డారు. ఇక్కడ కూడా విపరీతమైన జాప్యం చోటుచేసుకుంది. ఈ నెల 15న కుంభకోణం వెలుగుచూస్తే కేసు నమోదుకు వారం రోజులకు పైనే పట్టింది. ఈ మధ్యలో కొందరు మధ్యవర్తుల ద్వారా రమణతో సంప్రదింపులు సాగించారు. అయినా సొత్తు రికవరీ సాధ్యం కాలేదు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్ సైతం కొంతమొత్తం సర్దుబాటు చేసి ఆ తర్వాత తూచ్ అంటూ వారు కూడా చేతులెత్తేశారు. దీంతో గత్యంతరం లేని స్థితిలో ఈ నెల 23న పోలీసులకు లిఖితపూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పిలవడం.. ఇంటికి పంపడం...

ఎలైట్ మాల్స్, దుకాణాల్లో కోట్లాది రూపాయల నిధులు గోల్‌మాల్ అయ్యాయని తెలుసు, నిందితులు అంతా అందుబాటులోనే ఉన్నారు. వెంటనే పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి ఉంటే కేసు ఈపాటికే ఒక కొలిక్కి వచ్చి ఉండేది. అంతర్గత విచారణ ఏదైనా ఉంటే పోలీసుల దర్యాప్తునకు సమాంతరంగా ఎక్సైజ్ శాఖ కూడా చేపట్టి ఉంటే బావుండేది. ఈ విషయాలేవీ ఎక్సైజ్ శాఖ పట్టించుకోలేదు. అంతర్గత విచారణ పేరిట మాల్స్ సిబ్బందిని రోజూ ఎక్సైజ్ స్టేషన్‌కు పిలిపించి కూర్చోబెట్టి సాయంత్రానికి ఇంటికి పంపడం చేశారు. ఈ కేసులో పెద్ద తలకాయల పాత్రను తప్పించేందుకే ఇలా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎందుకోసం, ఎవరి కోసం, ఎవరిని రక్షించడం కోసం ఇలా చేశారన్నదే ఇప్పుడు చర్చనీయాంశం. చివరికి చేసేదేమీ లేక పోలీసులకు ఫిర్యాదు చేసి ఎక్సైజ్ శాఖ చేతులు దులుపుకొంది. పోలీసులైనా ఈ కుంభకోణం గుట్టు విప్పుతారా.? ప్రభుత్వ ధనాన్ని రికవరీ చేస్తారా.? అనేది వేచి చూడాల్సి ఉంది.



తుపాకీ ఎక్కుపెట్టి విద్యార్థులకు వివరిస్తున్న ఎస్పీ దామోదర్

ఆయుధం.. రక్షణ బలగం

▶ ఆకట్టుకున్న పోలీసు ఓపెన్‌హౌస్

▶ అబ్బురపరిచిన జాగిలాల విన్యాసాలు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఒంగోలు పోలీసు కల్యాణ మండపంలో శుక్రవారం ఓపెన్‌హౌస్ నిర్వహించారు. విధి నిర్వహణలో పోలీసులు వినియోగించే వివిధ రకాల ఆయుధాలను ఇందులో ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ దామోదర్ స్వయంగా ఆయుధాలు చేతపట్టి వాటి పనితీరును విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. పోలీసులు వాడే సాంకేతిక పరిజ్ఞానంపైనా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు జాగిలాలు ఎస్పీ దామోదర్‌కు సెల్యూట్ చేయడం, రహస్యంగా దాచి ఉంచిన బాంబులను గుర్తించడం వంటి విన్యాసాలను చిన్నారులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ.. ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణలో భాగంగా ఎందరో పోలీసులు ప్రాణత్యాగాలు చేస్తున్నారని, వారి త్యాగాలను స్మరించుకుంటూ ఏటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కె.నాగేశ్వరరావు, అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఒంగోలు వన్ టౌన్, టూ టౌన్, తాలూకా సీఐలు వై.నాగరాజు, మేడా శ్రీనివాసరావు, కె.అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసు జాగిలం విన్యాసాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

దెబ్బతిన్న ప్రతి పంటకూ పరిహారం

▶ ఎరువులు అందుబాటులో ఉంచుతాం

▶ అందరి రైతుల వివరాలు నమోదు చేస్తాం

▶ ఈనాడు ఫోన్‌ఇన్‌లో జేడీఏ, అధికారులు

జిల్లాలో ఇటీవల వరుసగా కురిసిన భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. అందినకాడికి అప్పులు తెచ్చి సాగు చేసిన పంటలు దెబ్బతినడంతో రైతులకు నష్టం వాటిల్లింది. ప్రస్తుతం ఈ-క్రాప్ నమోదు, రబీ సాగుకు సెనగ, ఇతర విత్తనాల పంపిణీ సాగుతోంది. ఈ నేపథ్యంలో రైతులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను ‘ఈనాడు’ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తెచ్చారు. వీటికి జేడీఏ ఎస్.శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి గపీచంద్, దర్శి కేవీకే సీనియర్ శాస్త్రవేత్త జి.రమేష్ సమాధానాలిచ్చారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న ప్రతి పంటకూ నష్టపరిహారం వస్తుందని జేడీఏ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఇవీ ఆ వివరాలు... – న్యూస్‌టుడే, ఒంగోలు నగరం



సందేహాలను నివృత్తి చేస్తున్న జేడీఏ శ్రీనివాసరావు.. చిత్రంలో ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్, సీనియర్ శాస్త్రవేత్త రమేష్

ఎరువులు... పెట్టుబడి రాయితీ అందిస్తాం



? ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాచర్ల మండలం వద్దులవాగుపల్లెలో సాగు చేసిన పొగాకు, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. పరిహారం అందించేందుకు అధికారులు ఇంకా అంచనాలు చేపట్టలేదు. – **సుదర్శనరెడ్డి, వద్దులవాగుపల్లె**

✔ **జేడీఏ:** రైత్వారీ నష్టాల అంచనాకు ఈ నెల 27 వరకు సమయం ఉంది. మీ గ్రామానికి సిబ్బందిని పంపిస్తాం. మీరు కూడా స్థానిక రైతు భరోసా కేంద్రంలో సిబ్బందికి ఈ విషయం తెలపండి. వర్షానికి దెబ్బతిన్న ప్రతి పంటకూ ప్రభుత్వం నుంచి పెట్టుబడి రాయితీ సొమ్ము ఇప్పించేలా చర్యలు తీసుకుంటాం.

? పామూరు మండలం మోపాడు ఆయకట్టు కింద వరి సాగు చేశాం. డీఏపీ ఎరువు కొరతగా ఉంది. రైతు సేవా కేంద్రాల్లో అడిగితే ఇంకా రాలేదంటున్నారు. ఆయకట్టు రైతులకు తగినంత ఎరువులను కేటాయించి కొరత తీర్చాలి. – **అడుసుమల్లి ప్రభాకర చౌదరి, మోపాడు నీటి ప్రాజెక్ట్ కమిటీ మాజీ అధ్యక్షుడు**

✔ ఆయకట్టు కింద సాగు చేసిన పంటల కోసం ఇటీవలే ఎరువులు కేటాయించాం. త్వరలో మీకు అందుబాటులోకి వస్తాయి.

బతకని.. కాయలివ్వని కొబ్బరి...

? ఉద్యాన శాఖ నర్సరీలో ఒక్కో కొబ్బరి మొక్క రూ. 60 చొప్పున కొనుగోలు చేసి కొత్తపట్నం మండలం అల్లూరులో నాటాము. మొత్తం 250 మొక్కలు నాటగా.. ఇటీవల కురిసిన వర్షాలకు అందులో 30 వరకు చనిపోయాయి. వాటి బదులు ఉచితంగా మళ్లీ మొక్కలు ఇస్తారా? – **హరిశ్చంద్రారెడ్డి, అల్లూరు**

✔ **ఉద్యాన శాఖ అధికారి:** నిబంధనల ప్రకారం ఉచితంగా ఇవ్వడానికి అవకాశం లేదు. మీరు కొబ్బరి అభివృద్ధి బోర్డుకు దరఖాస్తు చేసుకుంటే హెక్టార్‌కు రూ.6 వేలు రాయితీ లభిస్తుంది. కొత్తపట్నం, దర్శి ప్రభుత్వ నర్సరీల్లో మామిడి, నిమ్మ, వాక్కాయలతో పాటు క్రోటాన్ వంటి అలంకరణ మొక్కలను రాయితీపై అందిస్తున్నాము. రైతులు వినియోగించుకోవచ్చు.



? మా ఇంటి పెరటిలో కొబ్బరి చెట్లు వేశాం. ఎత్తు పెరిగినప్పటికీ కాపు రావడం లేదు. – **రామరాజు, ఒంగోలు**

✔ **ఉద్యాన శాఖ అధికారి, కేవీకే శాస్త్రవేత్త:** కొబ్బరి చెట్ల పాదుల్లోకి మురుగు పోకుండా చూసుకోవాలి. తేమ ఎక్కువైతే కాపురాదు. 10-15 రోజులకు ఒకసారి నీరందిస్తే చాలు. ప్రస్తుతం పశువుల ఎరువు, 17-17-17, బోరాన్ 50 నుంచి వంద గ్రాములు వేస్తే కాపు నిలుస్తుంది.

ప్రీమియం చెల్లింపుతో బీమా...



? పంటల బీమా ప్రీమియం రైతు భరోసా కేంద్రాల్లో కూడా కట్టించుకునే ఏర్పాటు చేయాలి. అందుకోసం అక్కడ ఒక డిజిటల్ సహాయకుడిని అందుబాటులో ఉంచాలి. – **మండవ శ్రీనివాసరావు, రైతు నాయకుడు**

✔ బీమా ప్రీమియం చెల్లింపునకు మీ సేవా కేంద్రాలకే వెళ్లాలని లేదు. అవగాహన ఉంటే మొబైల్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ప్రీమియం చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. సచివాలయాల్లో డిజిటల్ సహాయకులు కూడా చేస్తారు. లేదా బ్యాంకులో పంట రుణం పొందేటప్పుడు కూడా బీమా ప్రీమియాన్ని మినహాయించుకుని రిజిస్ట్రేషన్ చేస్తారు.

? నాగులుప్పలపాడు మండలం ఈదుమూడిలో ఇటీవల వరి సాగు చేశాం. ఈ-క్రాప్ నమోదు ఇంకా చేయలేదు. – **బాచిన నాగేశ్వరరావు, ఈదుమూడి**

✔ రబీ ఈ-క్రాప్ నమోదు యాప్ ఇంకా అందుబాటులోకి రాలేదు. వచ్చే నెలలో ఈ ప్రక్రియ మొదలవుతుంది. వరి పంట నమోదుకు డిసెంబర్ 31 వరకు అవకాశం ఉంది. శనగ, జొన్న, మొక్కజొన్న, మిర్చి, మినుము పంటలకు డిసెంబర్ 15 వరకు సమయం ఉంది. వరికి ఎకరాకు రూ.215 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

ప్రభుత్వ విత్తనాలతోనే భరోసా...



? ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న కాక్-2 శనగ విత్తనాల ధరకు, ప్రైవేట్ మార్కెట్‌లో ధరకు పెద్ద తేడా లేదు. బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.9,200కే లభిస్తున్నాయి. – **వంశీకృష్ణ, మల్లవరప్పాడు, టంగుటూరు మండలం**

✔ ప్రభుత్వం రైతులకు అందించేందుకు ముందుగానే సేకరించి ప్రాసెస్ చేసింది. మొలక శాతం పరీక్షించి, సంచుల్లో సరఫరా చేస్తుంది. ఇందుకు రవాణా ఖర్చులూ ఉంటాయి. నాటినప్పుడు ఎక్కడైనా మొలక రాకపోతే రైతులు ఫిర్యాదు చేయవచ్చు. పరిశీలించి ఏపీ సీడ్స్ సంస్థ లోపం ఉంటే నష్టపరిహారం చెల్లిస్తారు. ప్రైవేట్ ద్వారా పొందే విత్తనాలకు ఈ గ్యారంటీ ఉండదనే విషయాన్ని రైతులు గమనించాలి.



స్వయం సహాయక సంఘాల మహిళలకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

850 సంఘాలకు రూ.100 కోట్లు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని 850 స్వయం సహాయక సంఘాలకు రూ.100 కోట్ల మేర రుణం మంజూరు చేయడం అభినందనీయమని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. డీఆర్డీఏ సహకారంతో ‘కెనరా నారీ శక్తి’ పేరిట ఒంగోలులో శుక్రవారం నిర్వహించిన రుణ మేళాలో కలెక్టర్ తమీమ్ అన్సారియా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో మంజూరు చేసిన రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇతర బ్యాంక్‌లు కూడా ముందుకొచ్చి లక్ష్యం మేరకు రుణాలు అందజేయాలని కోరారు. విజయవాడ వరద బాధితులకు జిల్లా నుంచి పంపిన ఆహారం తయారీలోనూ మహిళలు చురుగ్గా వ్యవహరించారని కొనియాడారు. కేవలం గంట వ్యవధిలోనే వందల సంఖ్యలో మహిళలు ముందుకొచ్చి వంటల తయారీలో పాల్గొన్నారని గుర్తు చేశారు. అనంతరం మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో బ్యాంక్ రుణ విభాగం జీఎం మమతా, డీఆర్డీఏ పీడీ వసుంధర, ఎల్డీఎం రమేష్, బ్యాంక్ ఏజీఎం శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతో నీటి సంరక్షణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములుగా చేసి నీటి సంరక్షణ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. నీటి సంరక్షణ పనులపై జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఈవోఆర్డీలు, ఏపీవో, ఏపీఎంలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలకు ఒంగోలు ప్రకాశం భవన్‌లో శుక్రవారం కార్యశాల నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని 57 గ్రామాల్లో పరిమితికి మించి భూగర్భ జలాలను వినియోగించినట్లు గుర్తించామన్నారు. నీటి వినియోగం.. ఇంకా ఎంత మేర అవసరం అనే విషయాలపై అధ్యయనం చేసి గ్రామాలకు నీటి బడ్జెట్ రూపొందిస్తున్నట్లు వివరించారు. ప్రతి మండలానికి వెయ్యి ఇంకుడు గుంతలు నిర్మించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో ముందుగా నమూనా ఇంకుడు గుంత నిర్మించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ జోసఫ్ కుమార్, భూగర్భ జల శాఖ డీడీ విద్యాసాగర్, జడ్పీ సీఈవో చిరంజీవి, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, డీఆర్డీఏ, మెప్మా పీడీలు వసుంధర, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొండలో అదృశ్యం.. గుంటూరులో ప్రత్యక్షం

▶ ఇంటి నుంచి వెళ్లిన బాలికలు, బాలుడు

▶ తల్లిదండ్రుల దరికి చేర్చిన పోలీసులు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: సింగరాయకొండకు చెందిన ఆ ముగ్గురు బాలికలకు పట్టుమని పదిహేనేళ్లు లేవు. కొద్ది సంవత్సరాల నుంచి సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉంటున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు వారిని మందలించారు. దీంతో సామాజిక మాధ్యమాల్లో తమకు పరిచయమైన యువకుల వద్దకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. పాఠశాలకు వెళ్తున్నట్లు తల్లిదండ్రులకు చెప్పి ఇంటి నుంచి బయటికొచ్చారు. అనంతరం సోదరుడిని వెంటబెట్టుకుని మూకుమ్మడిగా రైలెక్కారు. కుమార్తెలు పాఠశాలకు రాలేదంటూ అందిన సమాచారంతో రెండు కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. బంధువులతో కలిసి తీవ్రంగా గాలించినా ఆచూకీ లభించకపోవడంతో చివరికి పోలీసులను ఆశ్రయించారు.

▶ **మూడు గంటల్లో అప్పగింత...:** విషయం తెలుసుకున్న సింగరాయకొండ సీఐ హజరత్తయ్య ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ద్వారా ఎస్పీ దామోదర్‌కు సమాచారం అందించారు. ఆయన ఆదేశాలతో పోలీసులు రంగంలోకి దిగారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం సాయంతో బాలికల ఆచూకీ కోసం ప్రయత్నించారు. చివరికి గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించి సురక్షితంగా ఒంగోలు తీసుకొచ్చారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఫిర్యాదు అందితే సాయంత్రం ఆరు గంటలకల్లా వారిని ఎస్పీ దామోదర్ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. వీరంతా తొలుత సింగరాయకొండ స్టేషన్‌లో రైలెక్కి నెల్లూరు వెళ్లారని.. అక్కడ మరో రైలెక్కి తెనాలి చేరుకున్నారు. అనంతరం మరో రైలు మారి గుంటూరు వెళ్లినట్లు పోలీసు విచారణలో గుర్తించారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి తమ పిల్లలను సురక్షితంగా అప్పగించిన పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

నిందితుల స్థానంలో నకిలీలు

▶ వ్యాపార విభేదాలతో హత్యాయత్నం ▶ బెడిసి కొట్టిన సూత్రధారి కుతంత్రం

వ్యాపారంలో వివాదాలు, అప్పుల నేపథ్యంలో కోర్టు కేసులతో తనను ఇబ్బంది పెడతున్నాడంటూ ఒకరిని హత్య చేయించేందుకు ప్రయత్నించాడు. అందుకు గ్రేహౌండ్స్ జూనియర్ కమాండోకు తన స్థలాన్ని ఆన్‌లైన్ చేయించి ఎర వేశాడు. హత్యా ప్రయత్నం బెడిసికొట్టి బాధితుడు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. దీంతో ఈ కేసు తన పైకి రాకుండా ఓ నలుగురిపై నెట్టేందుకు ప్రయత్నించాడు. విచారణలో అసలు విషయం వెలుగు చూడటంతో పన్నాగం కథ అడ్డం తిరిగింది. డబ్బు కోసం ఆశపడ్డవారిని విడిచి పెట్టిన పోలీసులు.. కిరాయి ముఠాను కటకటాల వెనక్కు నెట్టారు. ప్రధాన నిందితుడి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. –న్యూస్‌టుడే, ఒంగోలు నేరవిభాగం



▶ **అంతా అతనే చేయిస్తున్నాడంటూ...:** పొదిలిలోని మధురానగర్ బ్యాంకు కాలనీకి చెందిన పెమ్మని ఓంకార్, అదే పట్టణానికి చెందిన పొల్లా రమేష్ స్థిరాస్తి వ్యాపారులు. వీరిద్దరూ కలిసి వ్యాపారం చేసే క్రమంలో విభేదాలు పొడచూపడంతో విడిపోయారు. పొదిలి మండలం మల్లవరం పంచాయతీ కొష్టాలపల్లి గ్రామానికి చెందిన దొండ్ల రామిరెడ్డిని భాగస్వామిగా చేసుకుని రమేష్ వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఓంకార్, రమేష్ ఒకరిపై ఒకరు దుష్ప్రచారం చేసుకుంటున్నారు. ఇద్దరూ కలిసి వ్యాపారం చేసే సమయంలో రమేష్‌కు ఓంకార్ పలువురి వద్ద అప్పులు ఇప్పించాడు. సదరు బకాయిలు సక్రమంగా చెల్లించకపోవటంతో రుణదాతలు రమేష్‌పై కోర్టులో కేసులు వేశారు. ఇదంతా ఓంకార్ చేయిస్తున్నాడని భావించిన రమేష్; తన నూతన భాగస్వామి రామిరెడ్డితో కలిసి అతన్ని హత్య చేయించాలని పన్నాగం పన్నాడు.

▶ **గ్రేహౌండ్స్ కమాండోతో కిరాయి ముఠా...:** చీమకుర్తి మండలం బక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఇట్లా భాస్కరరావు గ్రేహౌండ్స్ జూనియర్ కమెండోగా పనిచేస్తున్నారు. ఆయనకు పొదిలి సమీపంలో కొంతభూమి ఉంది. దాన్ని ఆన్‌లైన్ చేయించడంతో పాటు పాసు పుస్తకం ఇప్పిస్తానని రమేష్ అతనితో నమ్మబలికాడు. అందుకు ప్రతిఫలంగా తన ప్రత్యర్థి ఓంకార్‌ను హత్య చేసేందుకు సహకరించాలని కోరాడు. రూ.8 లక్షలు కూడా ఇస్తానని చెప్పాడు. సమ్మతించిన భాస్కరరావు కంభం మండలం రావిపాడు గ్రామానికి చెందిన తన బావమరిది జగన్నాథం సిసింద్రీ అలియాస్ శశి, అతని స్నేహితులు దూదేకుల నాయబ్‌రసూల్, బేస్తవారపేటకు చెందిన దూదేకుల బాల శివప్రసాద్‌లతో ముఠాగా ఏర్పడ్డారు. ఈ నెల 15వ తేదీ రాత్రి ఓంకార్‌పై ఇనుపరాడ్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. అతను స్పృహ తప్పి పడిపోవడంతో చనిపోయాడని భావించి పరారయ్యారు. స్థానికులు ఓంకార్‌ను రక్షించి వైద్యశాలలో చేర్చారు. ఈ ఉదంతంపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

అజ్ఞాతంలోకి అసలు వ్యక్తి...

ఓంకార్ కోలుకోవడంతో తన పాత్ర వెలుగులోకి వస్తుందని భావించిన రమేష్ కొత్త నాటకానికి తెర లేపాడు. ఈ హత్యాయత్నాన్ని తమపై వేసుకుని జైలుకు వెళ్తే ఒక్కొక్కరికీ రూ.లక్ష ఇస్తాననీ, బెయిల్ ఇప్పించే బాధ్యత తీసుకుంటానని నలుగురు వ్యక్తులను మాట్లాడుకున్నాడు. దీంతో తామే హత్యాయత్నం చేశామని వారు పోలీసుల వద్ద లొంగిపోయారు. సీఐ టి.వెంకటేశ్వర్లు, ఎస్సై ఉన్నం వేమన వారిని లోతుగా విచారించడంతో రమేష్ నడిపిన నకిలీ నాటకం బయటపడింది. అప్పటికే రమేష్ అజ్ఞాతంలోకి జారుకున్నాడు. ఆయన వ్యాపార భాగస్వామి రామిరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించడంతో కిరాయి హత్యకు పథకం వేసిన విషయం బహిర్గతమైంది. దీంతో గ్రేహౌండ్స్ జూనియర్ కమెండో భాస్కర్‌రావుతో పాటు అతని బావమరిది సిసింద్రీ అలియాస్ శశి, నాయబ్‌రసూల్, బాల శివప్రసాద్‌లను పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో ఈ కేసు ఛేదించిన సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వేమనతో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

బీసీ కార్పొరేషన్ ఈడీ నియామకం



వెంకటేశ్వరరావు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీగా ఎం.వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి పోలా భాస్కర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటేశ్వరరావు గతంలో బీసీ కార్పొరేషన్ ఈడీ, ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్‌గానూ విధులు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా తాటిగడప మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. తిరిగి తాజాగా జిల్లాకు వస్తున్నారు. ఇప్పటి వరకు బీసీ కార్పొరేషన్‌కు కూడా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్ అదనపు బాధ్యతలు నిర్వహించారు.



(c) eenadu

కొంగొత్తగా చదువుల బడి

◗ పూర్వ విద్యార్థులు, దాతల అండ ◗ రూ.60 లక్షలతో వసతుల కల్పన



దాతల సహకారంతో ఏర్పాటుచేసిన ప్రవేశ ద్వారం

చదువులు నేర్పిన బడికి వారంతా అండగా నిలిచారు..లక్షలాది రూపాయలు వెచ్చించి వసతులన్నీ సమకూర్చారు. దీంతో వెలిగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాల కాస్తా కార్పొరేట్ బడులకు దీటుగా నిలబడింది.

న్యూస్‌టుడే, కనిగిరి, వెలిగండ్ల :

వెలిగండ్ల మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల రెండెకరాల విస్తీర్ణంలో ఉంది. 580 మంది విద్యనభ్యసిస్తున్నారు. అసౌకర్యాలకు నిలయంగా ఉండే ఈ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు, ఉపాధ్యాయులు తమవంతు కృషి చేస్తున్నారు. ఇక్కడ చదివిన పూర్వ విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. తాము చదివిన బడిని మర్చిపోకుండా అభివృద్ధికి సహకరిస్తున్నారు. వీరితో పాటు వెలిగండ్ల మండలానికి చెందిన పారిశ్రామికవేత్తలు, గుత్తేదారులు, ఇతర ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేస్తున్నవారు పూర్తిగా సహకరిస్తున్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తమ వంతు చేయూతనం దిస్తుండటంతో ఒక్కో వసతి సమకూరుతోంది.

పెద్దఎత్తున నిధులు వెచ్చించి..

పూర్వ విద్యార్థులు ఎంతో శ్రద్ధ తీసుకుని రూ.రెండు లక్షలు వెచ్చించి ప్రహరీ గోడ, రూ.లక్ష వెచ్చించి ఫ్లోరింగ్ ఏర్పాటు చేయించారు. ఇవికాక పెద్దఎత్తున పూల మొక్కలు అందించారు. పచ్చదనం సమకూర్చారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న దాతలు ఉత్సాహంగా ముందుకొచ్చారు. రూ.లక్ష వెచ్చించి సభా వేదిక సమకూర్చారు. ఇవేకాక ఆర్వో ప్లాంట్, బల్లలు, ఫ్యాన్లు, కుర్చీలు అందించారు. సరస్వతీ దేవి, ఇతర విగ్రహాలు, కంప్యూటర్లు, ప్రింటర్లు, డిజిటల్ తరగతి గదులు వంటివి నెలకొల్పారు. ఇలా పూర్వ విద్యార్థులు, దాతలు రూ.60 లక్షలు వెచ్చించడం విశేషం.



ప్రైవేటు కంపెనీ ఏర్పాటుచేసిన శుద్ధిజల కేంద్రం



ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువులు

చదువుల్లోనూ మేటి..

ఈ పాఠశాల ప్రతి ఏటా పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత సొంతం చేసుకుంటోంది. పలుమార్లు వందకు వందశాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఇక్కడి వారు ట్రిపుల్ ఐటీలోనూ సత్తా చాటుతున్నారు. ఈ ఏడాది 12 మంది దీనికి ఎంపికయ్యారు. ఎంఎంఎస్ జాతీయ ఉపకార వేతనానికి 12 మంది ఎంపిక కావడం విశేషం. పాఠశాలలో కూరగాయలు, ఆకుకూరల తోట సాగు చేస్తున్నారు. పాఠశాల పచ్చదనానికి ప్రతిరూపంగా ఉంది.

అందరి సహకారంతో వసతులు

పాఠశాల అభివృద్ధికి దాతలు, పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు, పాఠశాల సిబ్బంది ఎంతో చేయూతనందిస్తున్నారు. పెద్దఎత్తున నిధులు వెచ్చించడంతో అన్నీ సమకూరాయి. గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్నారు. -బొగ్గరపు రాఘవాచారి, ప్రధానోపాధ్యాయులు



నిండుకుండలా రామతీర్థం

◗ మూడు రోజుల్లో గరిష్ఠస్థాయి నీటిమట్టం

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఈ ఏడాది మొదటిసారిగా రామతీర్థం జలాశయం నీటిమట్టం పూర్తి స్థాయికి చేరుతోంది. గత వారంలో కురిసిన వర్షాల నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో నీటి వినియోగం తగ్గింది. అదే సమయంలో సాగర్ ఒంగోలు బ్రాంచి కాలువ ద్వారా భారీగా నీరు వచ్చి చేరుతుండటంతో నీటిమట్టం గరిష్ఠానికి చేరుతోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 85.34 మీటర్లు కాగా, శుక్రవారం సాయంత్రానికి 84.78 మీటర్లుగా ఉంది. ప్రస్తుతం వస్తున్న స్థాయిలోనే ఓబీసీ ద్వారా నీరు వచ్చి చేరితే స్పిల్‌వేపై నీరు పారే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

వరుస భారీ వర్షాలతో...

రామతీర్థం రిజర్వాయర్‌ను 2009 సంవత్సరం ఫిబ్రవరి 25న జాతికి అంకితం చేశారు. గడిచిన ఈ పదిహేను సంవత్సరాల్లో అతి కొద్ది సార్లు మాత్రమే రిజర్వాయర్‌లోకి పూర్తిస్థాయిలో నీరుచేరి అలుగు ద్వారా దిగువకు పారిన పరిస్థితి. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో గత వారంలో అయిదు రోజులపాటు నిరంతరాయంగా వర్షాలు కురిశాయి. దీంతో ఎగువ ప్రాంతంలో నీటి వినియోగం బాగా తగ్గింది. ఓబీసీ ద్వారా సుమారు 700 క్యూసెక్కుల మేర సాగర్ జలాలు వచ్చి రామతీర్థంలో చేరుతున్నాయి. శుక్రవారం కూడా ఈ ప్రవాహం 719 క్యూసెక్కులుగా ఉంది. గురువారం దిగువకు సుమారుగా 380 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మూడు నాలుగు రోజుల్లోనే రామతీర్థం పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. దీంతో ఈ ఏడాది తాగు, సాగునీటి కష్టాలు దూరమవుతాయని అంచనా వేస్తున్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, పక్కన అధికారులు

పంటల బీమాపై అవగాహన

ముండ్లమూరు, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం ద్వారా నోటిఫైడ్ పంటలకు ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని వేంపాడులో దీనిపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో వరి, శనగ, మినుము, ఎండుమిర్చి, మొక్కజొన్న తదితర పంటలకు ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలని సూచించారు. వరి పంటకు డిసెంబర్ 31 లోపు, శనగ, మినుము, ఎండుమిర్చి, మొక్కజొన్న, జొన్న పంటలకు డిసెంబర్ 15వ తేదీ లోపు ప్రీమియం చెల్లించాలని సూచించారు. వ్యవసాయశాఖ ద్వారా అమలవుతున్న పథకాలు వివరించారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంటనమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసనాయక్, ఫరూక్, వీఏఏలు శోభారాణి, బాలవెంకయ్య, రైతులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు గడువు పొడిగింపు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: డీఎస్సీ ఉచిత శిక్షణ కొరకు జ్ఞానభూమి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 27వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్ తెలిపారు. దరఖాస్తులకు ఈ నెల 25వ తేదీ వరకు గడువు విధించగా, మరో రెండు రోజులు పొడిగించినట్లు వివరించారు. ఈ మేరకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

27న బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: గుడ్లూరు మండలం చేవూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 27న ఉమ్మడి ప్రకాశం మహిళల, పురుషుల బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ కార్యదర్శి సోమినేని సురేష్ పేర్కొన్నారు. చేవూరులో పురుషుల జట్టు ఎంపిక పోటీలు, అదేరోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి గురవాజీపేట ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మహిళల జట్ల ఎంపిక ఉంటుందన్నారు. ఎంపికైన జట్లు నవంబర్ 8,9,10 తేదీల్లో కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. వివరాలకు 9849429839కు సంప్రదించాలన్నారు.

ఎంఆర్‌పీ ధరకు మద్యం ఇవ్వలేదని.. ఆత్మహత్యాయత్నం

మార్కాపురం, న్యూస్‌టుడే : ప్రభుత్వం ఎంఆర్‌పీ ధరలకు మద్యం ఇవ్వడం లేదని చెప్పి ఓ మందు బాబు ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాయవరం గ్రామస్థులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రాయవరం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు శుక్రవారం గ్రామంలోని ప్రభుత్వ దుకాణానికి వెళ్లి రూ.99కే మద్యం ఇవ్వాలని కోరారు. వారు ఇంకా ఆ రకం మద్యం రాలేదని చెప్పడంతో ఆగ్రహానికి గురయ్యాడు. తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకున్నాడు. స్థానికులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా వారిని బెదిరించాడు. వారు పెట్రోలు సీసాను లాక్కోవడంతో ప్రమాదం తప్పింది.. కొంత సేపు వాగ్వాదం తర్వాత అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయంపై మార్కాపురం ఎక్సైజ్ ఎస్సై గోపాలకృష్ణను న్యూస్‌టుడే వివరణ కోరగా ఓ వ్యక్తి తగ్గించి మద్యం అమ్మకం చేయాలని పెట్రోలు పోసుకొని హడావుడి చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ప్రస్తుతం మద్యం విక్రయాలు సాగిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే ప్రభుత్వం చెప్పిన అన్ని రకాల బ్రాండ్లు తక్కువ ధరకు అందుబాటులోకి వస్తాయని ఎస్సై చెప్పారు.

చోరీకి యత్నిస్తుండగా పట్టివేత

గిద్దలూరు పట్టణం: గిద్దలూరు నగర పంచాయతీ వీరన్నబావి వద్ద గురువారం రాత్రి ఇంట్లో చోరీకి యత్నిస్తున్న దొంగను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధితుడి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వీరన్నబావి కూడలి వద్ద నివాసముండే కొప్పురపు రమేష్‌బాబు గత మంగళవారం కుటుంబ సభ్యులతో కలసి అన్నవరం దేవస్థానానికి వెళ్లారు. తిరిగి గురువారం రాత్రి ఒంటి గంట సమయంలో ఇంటికెళ్లగా..తాళం తీసి, లైట్లు వేసి ఉన్నాయి. ఇంట్లో ఓ వ్యక్తి చోరీ చేస్తుండటాన్ని గమనించిన ఆయన స్థానికులకు విషయం చెప్పారు. వారంతా ఇంట్లోకి వెళ్లి అతన్ని పట్టుకునేందుకు ప్రయత్నించగా అదుపు తప్పి పడిపోయాడు. అనంతరం నిందితుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. నిందితుడు వైఎస్సార్ కడప జిల్లా కాశీనాయన మండలం నరసాపురానికి చెందిన గోపవరపు ప్రసాద్‌గా గుర్తించారు. ఇతను పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

KANIGIRI MUNICIPALITY
E-Procurement Short Tender Notice
Roc.No.884/2022/GF/E1, Dt.25.10.2024
(1) NIT.No.15/2024-25 (15th FC),
(2) 16/2024-25 & 17/2024-25 - 2 Works (General Funds)
15th FC Grant Rs.20.00 Lakhs & General Fund Rs.40.00 Lakhs
Total: Rs.60.00 Lakhs
Further details can be seen at 'e' procurement Market place in www.apeprocurement.gov.in officer inviting bids Commissioner, Kanigiri Municipality, Kanigiri, Andhra Pradesh.
Ph: 9440418982
Sd/- Commissioner, Kanigiri Municipality

ఉచిత ఇసుక సరఫరాకు చర్యలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజలకు పారదర్శకంగా ఉచిత ఇసుక సరఫరా జరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా సూచించారు. అమరావతి నుంచి ఆయన శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో వీక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా నుంచి కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ రోణంకి గోపాలకృష్ణ, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, జిల్లా గనులశాఖ అధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ



సమీక్ష నిర్వహిస్తున్న సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ

భూములు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: వివిధ ప్రభుత్వ శాఖలకు కేటాయించిన భూములు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం పలు శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పలు అవసరాల కోసం గతంలో వివిధ శాఖలకు కేటాయించిన భూముల స్థితిగతులపై ఆరా తీశారు. ప్రభుత్వం కేటాయించిన అవసరాలకే వాటిని వినియోగించాలన్నారు. ఇతర అవసరాలకు భూములు కావాలంటే తెలియజేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో శ్రీలత, మార్కాపురం ఉప కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేద్దాం

టంగుటూరు, న్యూస్‌టుడే: కొండపి నియోజకవర్గంలో తెదేపా సభ్యుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కార్యకర్తల సాయంతో విజయవంతం చేద్దామని రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ **దామచర్ల సత్య** కోరారు. అమరావతిలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ శనివారం నుంచి ప్రారంభమవుతున్న పార్టీ సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యకర్తలకు ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు.



సెస్ బకాయిల చెల్లింపుపై నిర్లక్ష్యం తగదు



మున్సిపల్ కమిషనర్లు, అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్వో శ్రీలత

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి నెలా వసూలైన ఇంటి పన్నులో గ్రంథాలయ సంస్థకు 8 శాతం చొప్పున సెస్ చెల్లించాలని డీఆర్వో ఆర్.శ్రీలత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని చాంబర్‌లో శుక్రవారం జిల్లా గ్రంథాలయ సెస్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఒంగోలు నగర పాలక సంస్థతోపాటు, ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, గ్రామ పంచాయతీలు కలిపి మొత్తం రూ.20 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. మే నెలలో జరిగిన కమిటీ సమావేశంలో 50 శాతం బకాయిలను మూడు నెలల్లోనే చెల్లిస్తాం, మిగతా పూర్తి బకాయిలను ఆరు నెలల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. బకాయిలు పేరుకుపోయినా నేటికీ 50 శాతం కూడా చెల్లించకపోవడం ఏమిటని కమిషనర్లను ప్రశ్నించారు. గ్రంథాలయ సంస్థ సిబ్బందికి జీతభత్యాలు సెస్ మీదనే ఆధారపడి ఉంటాయని, సకాలంలో చెల్లించకపోతే ఎలా అని ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో నీటి సంరక్షణ పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డ్వామా పీడీ జోసఫ్ కుమార్ ఆదేశించారు. నీటి సంరక్షణ పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఒంగోలు, కొత్తపట్నం, మద్దిపాడు మండలాలకు చెందిన క్షేత్రసహాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు, రూఫ్ వాటర్ నీటి సంరక్షణ, పంట కుంటల నిర్మాణం వంటి పలు కార్యక్రమాలను డ్వామా ఆధ్వర్యంలో అమలు చేస్తున్నట్లు వివరించారు. 2024-25 సంవత్సరానికి అన్ని గ్రామాల్లోనూ ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. మండలానికి 1,000 ఇంకుడు గుంతలు నిర్మించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. సమావేశంలో డ్వామా ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో శేషుబాబు పాల్గొన్నారు.

ఉత్పత్తిదారుల సమాఖ్యతో రైతన్నకు ఎరువులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య ద్వారా ఉమ్మడి ప్రకాశంలోని ఏడు వేలం కేంద్రాల పరిధిలోని రైతులకు ఎరువుల సరఫరా చేపట్టారు. సమాఖ్య అధ్యక్షుడు బసివిరెడ్డి మాట్లాడుతూ రైతులు ముందుగా బుక్ చేసుకున్న ఎరువులను ప్లాట్‌ఫారాలకు చేర్చి అక్కడ అందజేస్తున్నట్లు చెప్పారు. ఒంగోలు-1, 2, టంగుటూరు, కొండపి, పొదిలి, కనిగిరి, కందుకూరు-1 వేలం కేంద్రాల పరిధిలో మొత్తం 2,284 టన్నులు సరఫరా చేసినట్లు చెప్పారు. రైతులు వేలం కేంద్రాలకు వెళ్లి ఎరువులు పొందవచ్చన్నారు. అదేవిధంగా ఒంగోలు మార్కెట్ కమిటీ, మద్దిపాడు, నాగులుప్పలపాడు, దొడ్డవరం, త్రిపురాంతకం బ్రాంచీల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఎరువులు పొందవచ్చన్నారు. ఒంగోలు రెండో వేలం కేంద్రంలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, రైతు నాయకులు వడ్డెళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలు వేలం కేంద్రం వద్ద రైతులకు ఎరువుల సరఫరా

రైల్వేశాఖ సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా మాగుంట

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖకు సంబంధించిన సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.



నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 120, రిటైల్ లైవ్ - 142, చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్- 234

బాలుడి అనుమానాస్పద మృతి

◗ గిద్దలూరు మేకల నరవలో ఘటన

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : ఓ బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ సంఘటన గిద్దలూరు నగర పంచాయతీ మేకల నరవ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. బాలుడి తల్లిదండ్రుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గిద్దలూరు సత్యనారాయణ నగర్‌లో నివాసముండే పఠాన్ మహబూబ్ బాషా కుమారుడు హుస్సేన్‌ఖాన్ (14) ఈ నెల 23న పాఠశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికొచ్చాడు. అనంతరం ఆడుకొనేందుకు వెళుతున్నానని చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం తండ్రి కుమారుడి కోసం గాలిస్తూ రాచర్ల రహదారిలోని సెయింట్‌పాల్స్ బీఎడ్ కళాశాల వెనుక వైపు కొండపైన మంచినీటి ఫిల్టర్ పాయింట్ కోసం తవ్విన ప్రాంతానికి వెళ్లారు. అక్కడ ఓ బాలుడి మృతదేహం కన్పించడంతో వెంటనే అతను పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సురేష్ సిబ్బందితో అక్కడికి చేరుకొని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నీటికుంట సమీపంలోనే బాలుడి దుస్తులు, చెప్పులు ఉన్నాయి.



హుస్సేన్‌ఖాన్ (పాత చిత్రం)

గంజాయి సేవించే వారి పనే..: బాలుడు హుస్సేన్‌ఖాన్ ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీటి కుంటలో మునిగి మృతిచెందాడా లేకా ఎవరైనా చంపి అక్కడ పడవేశారా అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. తమ ఇంటి పరిసరాల్లోని యువకులు గంజాయి, మద్యానికి అలవాటు పడ్డారని, వారు హత్యచేసి పడేసి ఉంటారని బాలుడి తండ్రి మహబూబ్ బాషా అనుమానం వ్యక్తం చేశారు.

వేర్వేరు సంఘటనల్లో ముగ్గురి దుర్మరణం

మార్కాపురం : జిల్లాలో వేర్వేరు సంఘటనల్లో ముగ్గురు మృతి చెందడం విషాదం నింపింది. మార్కాపురం గ్రామీణ ఎస్సై అంకమ్మరావు తెలిపిన వివరాల ప్రకారం..భూపతిపల్లెకు చెందిన గాయం సాంబశివారెడ్డి (36) వెంకట దీప్తి దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. గతేడాది భర్త సాంబశివారెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో ఏ పనులు చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో భార్య వెంకటదీప్తి కూలి పనులు చేస్తూ పోషణభారం చూస్తున్నారు. సాంబశివారెడ్డి మద్యానికి బానిసవ్వడానికి తోడు భార్యపై అనుమానం పెంచుకున్నాడు. దీంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం భార్యను మద్యానికి డబ్బులిమ్మని అడగ్గా ఆమె నిరాకరించింది. దీంతో మనస్తాపానికి గురైన సాంబశివారెడ్డి ఫ్యాన్‌కు ఉరేసుకోని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై..

దొనకొండ, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందారు. ఈ సంఘటన దొనకొండ మండలంలోని కొచ్చెర్లకోట పంచాయతీలో చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొచ్చెర్లకోటకు చెందిన ఓ రైతు వ్యవసాయ పరివర్తకం ఫ్యూజ్ పాడవ్వగా విద్యుత్తు అధికారులకు తెలిపినా వారు స్పందించలేదు. దీంతో గురువారం స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా, విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

మద్యం అనుకుని పురుగుల మందు తాగి..

యర్రగొండపాలెం పట్టణం : మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన యర్రగొండపాలెం మండలం అమానిగుడిపాడులో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు..అమానిగుడిపాడుకు చెందిన గోళ్ల ఎల్లయ్య(54) మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి మద్యం సీసాలు తెచ్చుకుని తాగాడు. ఆ మత్తులో ఇంట్లో ఉన్న పురుగుల మందును మద్యంగా భావించి తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే బంధువులు మార్కాపురంలోని ఓ వైద్యశాల్లో చేర్పించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుమార్తె రమణమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై చౌడయ్య కేసు నమోదు చేశారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 91699 22299.

EDUCATION

రూబీ నర్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఒంగోలు నందు రెగ్యులర్ నర్స్ కోర్సులు ANM & DMLT- 2Y డిప్లమా కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. వయస్సుతో నిమిత్తం లేదు. Q: ఇంటర్ SC,ST, BC, OBC వారికి స్కాలర్ షిప్ & హాస్టల్ సౌకర్యం కలదు. ✆ 9440274196.

REAL ESTATE

AP రాజధానిలో కమర్షియల్ స్థలం గజం 23 వేలు, మంగళగిరిలో గ॥ 14 వేలు, కంతేరు గ॥ 12 వేలు, కమర్షియల్ 30 లక్షలు 15 వేలు రెంటు, గుంటూరులో గ॥ 23 వేలు కమర్షియల్ 41 వేలు. ✆: 96035 30555.

PLOT FOR SALE

అమరావతి రాజధానికి కేవలం 5KM దూరంలో CRDA LP నెంబర్‌తో అతి తక్కువ ధరలో ప్లాట్లు కలవు. Bank లోను కలదు. ✆ 8125755666.

JOBS

Paparao High School, K.Uppalapadu, Prakasam. Wanted Qualified Teachers for High School, Social, Hindi, Telugu Primary (Female-All Subjects) & Lady Wardens. Free Boarding & Lodging, Salary Negotiable. ✆: 7019326579.

చిరంజీవ చిట్‌ఫండ్స్ (ప్రై)॥ లి॥ బ్రాంచెస్‌లో పనిచేయుటకు చిట్‌ఫండ్స్‌లో 3 సం॥లు అనుభవం కలిగిన బ్రాంచి మేనేజర్స్, అకౌంట్స్ ఆఫీసర్స్, అసిస్టెంట్ మేనేజర్స్, బిజినెస్ మేనేజర్స్, కలెక్షన్ స్టాఫ్ కావలెను. జీతం + ఇన్‌సెంటివ్స్. Ph: 72868 74417.

ఒంగోలు, నెల్లూరు, తిరుపతి ప్రముఖ ఆటోమొబైల్ సంస్థలో పనిచేయుటకు హెల్పర్స్ - 10th క్లాస్, కౌంటర్ ఎగ్జిక్యూటివ్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్- డిగ్రీ చదివినవారు కావలెను. Ph: 96767 82106 / 92471 13200.

హరేకృష్ణ హోంకేర్ విజయవాడ నందు వృద్ధులను/ పేషంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. ✆ 96405 28899, 96406 48899.

శ్రీ వెంకటేశ్వర ఫైనాన్షియర్స్ నందు ఒంగోలు పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు అనుభవజ్ఞులైన ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Cont: 7680902220.

ఒంగోలులోని మూర్తి స్వీట్స్ షాపు నందు పనిచేయుటకు అనుభవం కలిగిన ఆటో డ్రైవర్ & ఆపరేషన్ మేనేజర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్ర: 9347760820.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటన కర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు...
B/W 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే
వివరాలకు..
97011 12824
ఒంగోలు
80087 09902
మార్కాపురం
80081 11050
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 500
Colour : రూ. 700
ప్రకటనలపై 5% GST వర్తించును



(c) eenadu

మార్కాపురం
•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం




కంభం: పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, విజేతలతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అమూల్య, ఉపాధ్యాయులు

ప్రతిభా పరీక్షలతో విజ్ఞానం

కంభం, న్యూస్‌టుడే: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'అంతర్జాల వినియోగంపై లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు జి.చైత్ర (10), డి.సఫియా (8), ఎస్‌డీ ఎండీ నాజినిన్ (10 తరగతి) మొదటి మూడు బహుమతులు గెలుచుకున్నారు. వారికి ప్రధానోపాధ్యాయురాలు అమూల్య, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్. కేశవ, కృష్ణమోహన్ బహుమతులు అందజేశారు.

మార్కాపురం, న్యూస్‌టుడే: మండలంలోని గజ్జలకొండ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో 8-10వ తరగతి విద్యార్థులకు 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కె.వి.రాజ్యలక్ష్మి(8వ తరగతి) ప్రథమ, బి.అజయ్(10వ తరగతి) ద్వితీయ, బి.త్రివేణి(10వ తరగతి) తృతీయ బహుమతులు సాధించారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దొడ్డ రామాంజనేయరెడ్డి, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.




మార్కాపురం: గజ్జలకొండలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, గెలిచిన వారితో ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయరెడ్డి, ఉపాధ్యాయులు

ఎస్‌ఐల నియామకం



టూటౌన్ ఎస్సైగా రాజమోహన్‌రావు



ట్రాఫిక్ ఎస్సైగా సీహెచ్.అహరో

మార్కాపురం: మార్కాపురం పట్టణ టూటౌన్ ఎస్సైగా రాజమోహన్‌రావు నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా ఎస్పీ దామోదర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండు నెలలుగా మార్కాపురంలో ఈయన శిక్షణ ఎస్సైగా పని చేస్తున్నారు. మార్కాపురం పట్టణ ట్రాఫిక్ ఎస్సైగా సీహెచ్.అహరోను నియమించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

కొనకనమిట్ల, గిద్దలూరు పట్టణం, యర్రగొండపాలెం పట్టణం,పెద్దారవీడు : పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కొనకనమిట్ల పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం ఎస్సై రాజ్‌కుమార్ ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. రోజువారీ కేసుల వివరాలు, బాధితులకు న్యాయం చేయడంపై పోలీసుల పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ● గిద్దలూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే తమ్ముడు ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసులు, పాత్రికేయులు, తెదేపా నాయకులు, డ్రైవర్లు రక్తదానం చేశారు. ●ఏపీఎస్పీ బెటాలియన్‌లో పనిచేస్తూ గిద్దలూరు మండలం నరవ గ్రామానికి చెందిన శ్రీరాములు, ముండ్లపాడుకు చెందిన పాలగిరి వెంకటరాములు అమరవీరులు కావడంతో శుక్రవారం ఆ గ్రామానికి కర్నూలు ఏపీఎస్పీ బెటాలియన్ డీఎస్పీ ఇడమకంటి సుధాకర్‌రెడ్డి వచ్చి పాఠశాల ఆవరణలో నివాళులర్పించారు. ● యర్రగొండపాలెం పట్టణంలో చైతన్య పాఠశాల, ఏపీ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులకు ఎస్సై చౌడయ్య పోలీస్ చట్టాలను వివరించారు. ● పెద్దారవీడు కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో 'సైబర్ నేరాల నియంత్రణలో యువత పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు.



యర్రగొండపాలెంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై చౌడయ్య

రాయితీపై శనగ విత్తనాల పంపిణీ

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: రైతులు రాయితీపై అందించే విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ ఛైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. ఆయన శుక్రవారం గిద్దలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ప్రభుత్వం రాయితీతో అందజేస్తున్న శనగల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడతా మధుసూదన్ యాదవ్, ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి, తెదేపా నాయకులు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.



రైతులకు రాయితీ విత్తనాలు అందజేస్తున్న తెదేపా నాయకులు

పెట్టుబడీ దక్కలేదు

☛ అకాల వర్షాలకు.. సజ్జ, కొర్ర రైతులు విలవిల



వర్షాలకు దెబ్బతిన్న సజ్జ

పొదిలిగ్రామీణం, న్యూస్‌టుడే:

పశ్చిమ ప్రాంతంలో అకాల వర్షాలకు ఖరీఫ్‌లో సాగుచేసిన సజ్జ, కొర్ర రైతులు తీవ్రంగా నష్టపోయారు. సజ్జ పంట ఏపుగా పెరిగి కొన్నిచోట్ల కోతకొచ్చింది. మరికొన్నిచోట్ల కంకులు పాలదశలో ఉన్నాయి. 20 రోజుల వరకు సజ్జ పంటపై ఎంతో ఆశగా ఉన్న రైతులకు తుఫాను ప్రభావంతో పడిన ముసురు వర్షాలు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల కోసిన సజ్జ కంకులు బూజుపట్టాయి, మరి కొన్నిచోట్ల రంగుమారాయి.

● పొదిలి మండలంలో 502 హెక్టార్లలో సజ్జ పంట వేయగా అందులో 400 హెక్టార్లలో పంట దెబ్బతింది. ఒక్కొక్క రైతు రూ.30 నుంచి 50 వేల వరకు నష్టపోయారు. ఇటీవల ప్రాంతంలో కొర్ర పంటకు డిమాండ్ పెరగడంతో అక్కడక్కడ కొర్రసాగు చేస్తున్నారు. పొదిలి మండలంలో ఈ సీజన్‌లో 20 హెక్టార్లలో పంట వేశారు. పంట దశలో వర్షాలు పడటంతో గింజలన్నీ పొలంలోనే రాలిపోయాయని, పంట చేతికి దక్కే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడి రైతులకు అనుకూలంగా అనిపించినా తుపాను ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. పొగాకు నాట్లు వేసిన రైతులు కొన్నిచోట్ల పొలాల్లో నీరు నిలబడటంతో పంట ఉరక్కెత్తింది. దీంతో మరోసారి నాట్లకు ఉపక్రమించారు. దీంతో పొగాకు రైతులకు పెట్టుబడులు పెరిగాయి.

పంట	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
కంది	9685
సజ్జ	502
వరి	40
కొర్ర	20
మిరప	259
పొగాకు	150

పూర్తిగా నష్టపోయా...



పదెకరాల్లో సజ్జ పంట సాగు చేశా. రూ.లక్ష ఖర్చు చేశా. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు కోసిన సజ్జ కంకులు కల్లాల్లోనే తడిసిపోయి, మొలకలు వచ్చాయి. కనీసం ఖర్చులు కూడా రాని పరిస్థితి. పెట్టుబడి పూర్తిగా బూడిద పాలైంది. నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలి. – బాదం నాగార్జునరెడ్డి, కుంచేపల్లి

గింజ చేతికి రాలేదు.....



నాకున్న ఆరు ఎకరాలకు తోడు మరో 14 ఎకరాలు గుత్తాకు తీసుకొని మొత్తం 20 ఎకరాల్లో కొర్ర పంట సాగు చేశా. పంట ఆశాజనకంగా ఉంది అనుకుంటున్న సమయంలో అకాల వర్షాలకు పూర్తిగా దెబ్బతీసింది. వర్షం ధాటికి కొర్ర గింజలు రాలిపోయాయి. రెండు లక్షల పెట్టుబడి నీటిపాలైంది. నష్ట పరిహారం ఇప్పించండి. – నగరికంటి జేమ్స్, పాములపాడు



క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త రామమోహన్, జిల్లా వనరుల కేంద్రం అధికారులు

తెగుళ్లపై అవగాహన కల్పించండి

బేస్తవారపేట, న్యూస్‌టుడే: రైతు సేవా కేంద్ర సిబ్బంది తెగుళ్లపై సరైన అవగాహన కలిగి ఉండాలని జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త రామమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సలకలవీడు సమీపంలోగల శంకర్‌రెడ్డి పొలంలో, వ్యవసాయ కళాశాలలో రైతు సేవాకేంద్ర సిబ్బంది, వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త రామమోహన్ యాప్‌ల ప్రాముఖ్యతను వివరించారు. గిద్దలూరు, మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ సంచాలకులు బాలాజీ నాయక్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్ర సిబ్బంది ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉండి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలు, సాంకేతిక సమాచారం రైతులకు చేరవేయాలని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్ర దర్శి శాస్త్రవేత్త వెంకటేశ్వరరెడ్డి కంది, పత్తి, వరి, సజ్జ, మొక్కజొన్న, ఆముదం, మిరప, మినుము తదితర పంటలలో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులను గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిణి వి.వి శేషమ్మ సీఎల్ఎస్-పీడీఎస్ఎస్, ఎన్‌పీఎస్ఎస్ యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేసే విధానం తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

మార్కాపురం పట్టణం, బేస్తవారపేట, కొనకనమిట్ల: పట్టణంలోని వాసవి విద్యానికేతన్‌కు చెందిన సీహెచ్.హేమంత రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కె.రంగయ్య తెలిపారు. బాపట్ల జిల్లాలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ అండర్-14 విభాగం పోటీల్లో సత్తా చాటినట్లు పేర్కొన్నారు. ●బేస్తవారపేటలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సిద్దేశ్వరరెడ్డి తెలిపారు. కందుకూరులో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ 800 మీటర్ల పరుగు పందెం అండర్-17 విభాగంలో విద్యార్థి బి.వి రవీంద్ర, రవితేజ జె.పంగులూరులో నిర్వహించిన ఖోఖో అండర్-14 విభాగంలో ఎస్.ఆనంద్, అండర్-17 విభాగంలో బి.వి రవీంద్ర ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ● ఇటీవల చీరాలలో జరిగిన జిల్లా స్థాయి అండర్-17 విభాగంలో బేస్తవారపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని లక్ష్మి కీర్తి లాంగ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు తిరుపతిరెడ్డి తెలిపారు. ● ఒంగోలులో ఇటీవల నిర్వహించిన కబడ్డీ పోటీల్లో (అండర్-17 విభాగంలో) గొట్లగట్టు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు మహేశ్వర, ఉమాశంకర్ సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తెలిపారు.

వివాదాస్పద భూముల పరిశీలన

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: మార్కాపురం మండలంలోని గోగులదిన్నె గ్రామ శివారులో ఇరువర్గాల మధ్య వివాదంలో ఉన్న భూములను శుక్రవారం రెవెన్యూ అధికారులతో పాటు సర్వేయరు కలిసి పోలీసుల సమక్షంలో పరిశీలన చేశారు. తహసీల్దారు కె.చిరంజీవి పర్యవేక్షణలో మండల సర్వేయరు సంజీవయ్యలతో పాటు ఇతర అధికారులు కలిసి గోగులదిన్నె గ్రామంలో సుమారు పది సర్వే నెంబర్లలో ఉన్న 41.58 ఎకరాల భూమి విషయంలో ఇరువర్గాల మధ్య గత కొంతకాలంగా వివాదం నడుస్తోంది. దీంతో ఇరువర్గాల వారు ఆ భూమి మాది అంటే మాది అని ఘర్షణ పడుతున్నారు. ఈ విషయం జిల్లా సంయుక్త కలెక్టర్ కోర్టులోనూ నడుస్తోంది. శుక్రవారం అధికారులు పోలీసు సమక్షంలో భూమిని పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు.



గోగులదిన్నెలో భూములను పరిశీలిస్తున్న తహసీల్దారు చిరంజీవి, అధికారులు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658
కంభం : 8008632343
పొదిలి : 8008550360


కంభం, న్యూస్‌టుడే:



సమస్య: స్థానిక అర్బన్ కాలనీలో ఇళ్ల పరిసరాల్లో మురుగు నీటి గుంత పాచిపట్టి అధ్వానంగా ఉంది. దీంతో దుర్వాసన వస్తోంది. దోమల బెడద అధికంగా ఉంది. దాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి. – నారాయణ, స్థానికుడు

సమాధానం: కాలనీకి సిబ్బందిని పంపించి గుంతను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. – రమేష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, కంభం

బాధ్యతల స్వీకరణ



పొదిలి, న్యూస్‌టుడే: దేవాదాయ శాఖ పొదిలి కార్యనిర్వహణాధికారిగా బి.లీలాకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదిలి దేవాదాయశాఖ పరిధిలో ఉన్న నిర్మమహేశ్వరస్వామి, లక్ష్మీనరసింహస్వామి, వేణుగోపాలస్వామి, పొదిలమ్మ, పోలేరమ్మ, మహాలక్ష్మమ్మ దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పుల్లలచెరువు, న్యూస్‌టుడే: విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పుల్లలచెరువు మండలంలోని అన్ని సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్తు శాఖ అధికారి కిషోర్ కుమార్ తెలిపారు.

మట్టిదారి.. ఆపై గుంతలు

రాచర్ల మండలం సంగపేట నుంచి జేబీకే పురం వరకూ ఉన్న రహదారి అధ్వానంగా ఉంది. జేబీకే పురం నుంచి సంగపేట, రామాపురం మీదుగా గిద్దలూరు వెళ్లే ఈ రోడ్డును చాలా దూరం తారు రహదారిగా మార్పు చేశారు. కేవలం నాలుగు కిలో మీటర్ల దూరం మాత్రమే మట్టి రోడ్డు ఉంది. దాన్ని తారు రోడ్డుగా మార్చకపోవడంతో గుంతలమయంగా మారింది. దీంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. సుమారు 20 గ్రామాల మీదుగా వెళ్లే ఈ దారిని బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. రహదారినిబాగు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని రహదారులు భవనాల శాఖ డీఈ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. – కంభం (రాచర్ల), న్యూస్‌టుడే



గ్రామాల్లో జోరుగా మద్యం అమ్మకాలు

❑ గొలుసు దుకాణాలకు మోటారు వాహనాల్లో సరఫరా



రాచర్లలో ఏర్పాటు చేసిన గొలుసు దుకాణం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే:

గిద్దలూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జోరుగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. గ్రామాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా మద్యం విక్రయాలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో లాటరీ ద్వారా మద్యం దుకాణాలను ఏర్పాటు చేయగా వారి వద్ద మద్యం కొనుగోలు చేసి గ్రామాలకు తరలించి గ్రామాల్లో విక్రయాలు చేపడుతున్నారు. రాచర్ల మండలంలో ఓ మద్యం దుకాణం దక్కించుకున్న వ్యాపారి ఓ వ్యక్తిని ఏర్పాటు చేసి మోటారు వాహనం అందించి గ్రామాల్లో మద్యం గొలుసు దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్నారు. సదరు మద్యం వ్యాపారి నిర్ణీత మద్యం దుకాణంలో కాకుండా సమీప గ్రామాల్లో అనధికారి మద్యం నిల్వల కేంద్రాన్ని ఏర్పాటు చేసి అక్కడి నుంచి మద్యం గొలుసుదుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్నారు. మద్యం గొలుసు దుకాణాల నిర్వాహకులు 24 గంటల పాటు మద్యం విక్రయిస్తున్నారు. ఒక్కో సీసాకు ఎంఆర్‌పీ కంటే అధనంగా రూ.50వరకు వసూలు చేస్తున్నారు. రాచర్ల మండలం చినగానిపల్లెలో 2, చోళవీడులో 4, ఆకవీడులో 5, జె.పి.చెరువులో 4 మద్యం గొలుసు దుకాణాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో పోలీసులు తనిఖీకి వెళ్లిన సమయంలో ముందస్తు సమాచారం అందుతుండటంతో మద్యం గొలుసు దుకాణం నిర్వాహకులు ఆ సమయంలో మద్యం నిల్వలు లేకుండా జాగ్రత్త పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసులు, ఎక్సైజ్‌శాఖ అధికారులు చొరవ తీసుకొని గ్రామాల్లో మద్యం గొలుసు దుకాణాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మద్యం సీసాల స్వాధీనం

కంభం, బేస్తవారపేట: కంభం మండలంలోని చిన్నకంభం గ్రామంలో నిర్వహిస్తున్న గొలుసు దుకాణంపై శుక్రవారం ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి, సిబ్బంది దాడి చేశారు. ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని 20 క్వార్టర్ సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ● బేస్తవారపేట మండలంలోని చిన్న ఓబినేనిపల్లిలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణంపై శుక్రవారం ఎస్సై రవీంద్రారెడ్డి సిబ్బందితో దాడులు నిర్వహించారు. నిర్వాహకుడు బి.నారాయణరెడ్డిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 35 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్సై రవీంద్రారెడ్డి

పూర్వ విద్యార్థుల వితరణ

మార్కాపురం, న్యూస్‌టుడే: గజ్జలకొండ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు జిరాక్స్ మిషన్‌ను బహూకరించారు. శుక్రవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు దొడ్డా రామాంజనేరెడ్డికి ఈ మిషన్‌ను అందజేశారు.

పెద్దదోర్నాల: కొత్తూరు, తిమ్మాపురం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఎంఈవో బి.మస్తాన్‌నాయక్ శుక్రవారం దుప్పట్లు, ప్లేట్లు, టూత్ బ్రష్‌లు, నీళ్ల సీసాలను పంపిణీ చేశారు. దోర్నాలకు చెందిన సేఫ్టీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్షావలి సొంత నిధులు రూ.40వేలతో సమకూర్చారని ఆయన తెలిపారు.

పారిశుద్ధ్య పనులు : పొదిలి గ్రామీణం: మండలంలోని ఉప్పలపాడు, గోగినేనివారి పాలెం గ్రామాల్లో కాలువల్లో పూడిక తొలగించి బ్లీచింగ్ చల్లించారు.

కష్టపడే తత్వాన్ని అలవరచుకోవాలి

మార్కాపురం పట్టణం : విద్యార్థులు కష్టపడే తత్వాన్ని అలవరచుకున్నపుడే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలరని జడ్పీ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ సూచించారు. పట్టణంలోని జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం బీటెక్, డిప్లమో, ఐటీఐ ప్రథమ సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ చదువుతో పాటు వివిధ నైపుణ్యాలను ఒడిసిపట్టాల్సిన ఆవశ్యకతను వివరించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.



ప్రశంసా పత్రాలు అందుకున్న వారితో జడ్పీ ఛైర్మన్ వెంకాయమ్మ, మాజీ మంత్రి సురేష్

సైన్సు ప్రదర్శనలో విద్యార్థినుల సత్తా

కంభం, న్యూస్‌టుడే : స్థానిక బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు సైన్సు ఫెయిర్ పోటీల్లో ప్రతిభ చూపారు. చీమకుర్తిలో ఈ నెల 24న జరిగిన 5 విభాగాల్లో పోటీలు జరిగాయి. స్మార్ట్ ఇరిగేషన్ సిస్టమ్ విభాగంలో ఎం.శిరీషభాయ్, ఆర్ట్, క్రాఫ్ట్ విభాగంలో కె.మాధురి ప్రథమ, స్మార్ట్ క్యాప్ ఫర్ బ్లైండ్ పీపుల్ ఎ.మహిమాన్విత, టైప్ ఆఫ్ యాగిల్స్ విభాగంలో ఎం.దీప్తిభాయ్ ద్వితీయ, ఫుడ్, న్యూటీషియన్ జి.దివ్యా, క్లాసికల్ డ్యాన్స్ విభాగాల్లో పి.పర్ణికరాజ్ బహుమతులు సాధించారు. వీరిని ప్రిన్సిపల్,చాముండేశ్వరి, ఉపాధ్యాయినులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

ప్రజలకు ఇసుక చేరువయ్యేనా..?



ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

పొదిలి, న్యూస్‌టుడే:

ఇసుకను ప్రజలకు చేరువ చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇసుకపై ఇప్పటివరకు ఉన్న సీనరేజీ రద్దుచేయడం, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఎడ్లబండ్లతో పాటు ట్రాక్టర్లలోను ఉచితంగా ఇసుకను తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అనుమతించడంతో ఇసుక ధరలు దిగి వస్తాయన్న ఆశతో ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా పశ్చిమ ప్రాంతంలో ఇసుక రీచ్‌లు లేకపోవడంతో ప్లాస్టింగ్ ఇసుక కోసం నెల్లూరు జిల్లాలోని రీచ్‌లపై ఆధారపడాల్సి వస్తుంది. కట్టుబడి ఇసుకను ఆయా గ్రామాల్లోని వాగులు, వంకల్లో సేకరించి విక్రయిస్తున్నారు. పొదిలి మండలంలో మూసి పరివాహక గ్రామాలైన ఈగలపాడు, ఉప్పలపాడు, యేలూరు, అన్నవరం పరిసర ప్రాంతాల్లో కట్టుబడి ఇసుకను సేకరించి ట్రాక్టర్లలో అమ్ముతున్నారు. మర్రిపూడి మండలంలో చిలంకూరు, జువ్విగుంట ప్రాంతాల్లోని వాగుల్లో నుంచి సేకరిస్తున్నారు. ఇప్పటివరకు ట్రాక్టర్ ఇసుక రూ.2500 నుంచి 3 వేల వరకు వసూలు చేశారు. గత ఆరు నెలలుగా అది కూడ కొరతగా ఉండటంతో కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారు నిర్మాణాలను వాయిదా వేసుకున్నారు. గతంలో ట్రక్కు ఇసుక రూ.1100 లకే సరఫరా చేసేవారు. ఇక ప్లాస్టింగ్ కోసం వినియోగించే మెత్తటి ఇసుకను నెల్లూరు నుంచి తెప్పించి పొదిలిలో కొంతమంది భారీగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. కొద్ది మొత్తంలో ఇసుక కావాల్సిన వారు ప్రభుత్వ నిబంధనల మేరకు ఆన్‌లైన్‌లో నమోదుచేసే ప్రయాస పడకుండా స్థానికంగా ఉన్న వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వీరు సైతం డిమాండ్‌ను బట్టి ధరలు భారీగా పెంచేశారు. ఆరునెలలుగా ఇసుక కొరతతో నిర్మాణాలు ఆగిపోవడంతో పాటు వాటిపై ఆధారపడిన కూలీలు సైతం ఉపాధి కోల్పోయారు. ప్రస్తుతం ఇసుక సేకరణ, రవాణాను సులభతరం చేయడంతో కేవలం కూలీల వేతనం, రవాణా ఖర్చులతో ఇసుకను అమ్మకాలు చేసుకునే అవకాశం ఉంది. అయితే వ్యాపారులు ఎంత మేర ధర తగ్గించి విక్రయిస్తారో, ప్రజలకు ఏమేరకు మేలు జరుగుతుందో వేచి చూడాలి.

జీవో 117 రద్దుపై హర్షం

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 117జీవో రద్దుకు తీసుకున్న నిర్ణయంపై ఉపాధ్యాయ వర్గాలపై హర్షం వ్యక్తమవుతుంది. తాజాగా తీసుకున్న నిర్ణయంతో నిర్ణయంతో ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం వస్తుందని ఆశిస్తున్నారు. 2021లో అప్పటి వైకాపా ప్రభుత్వం తెచ్చిన ఆ జీవో పాఠశాలల మనుగడను ప్రశ్నార్థకం చేసింది. బోధనా సిబ్బంది, వసతులు పట్టించుకోకుండా తీసుకున్న నిర్ణయంతో విద్యార్థుల సంఖ్య పడిపోయింది.

హామీని నిలబెట్టుకున్నారు



గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 117 పాఠశాలలను నిర్వీర్యం చేసింది. దీనిపై యూటీఎఫ్ సైతం పెద్ద ఎత్తున పోరాటం చేసింది. మేధావులు, విద్యావేత్తలు వ్యతిరేకించినప్పటికీ గత వైకాపా ప్రభుత్వం ముందుకు తీసుకువెళ్లే ప్రయత్నం చేసింది. అయితే ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ఇటీవల రద్దు నిర్ణయం ప్రకటించడం సంతోషదాయకం. – ఓ.వీరారెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు, మార్కాపురం

మంచి నిర్ణయాలు తీసుకోవాలి



ప్రభుత్వాలు తీసుకునే అనాలోచిత నిర్ణయాలతో ఒక తరం విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. వాస్తవంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల మధ్య వాతావరణం భిన్నంగా ఉంటుంది. అందుకే జీవో రద్దు, పూర్వ విధానం మేలని భావిస్తున్నా. కూటమి ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. – కె.ఎర్రయ్య, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

పెద్దదోర్నాల, పుల్లలచెరువు, న్యూస్‌టుడే: స్థానిక పురుగు మందుల దుకాణాలను అంతర్గత తనిఖీ బృందం అధికారి కె.బాలాజీనాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. దుకాణాల్లోని రిజిస్టర్స్, బిల్లు పుస్తకాలను, ధరల పట్టికను ఆయన పరిశీలించారు. అనుమతి ఉన్న కంపెనీ పురుగు మందులను విక్రయించాలని, తప్పనిసరిగా రైతులకు బిల్లులు ఇవ్వాలని ఆయన వారికి సూచించారు. అనుమతి లేని పురుగుమందులు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్‌నాయక్ ఉన్నారు. ● పుల్లలచెరువు మండల కేంద్రంలోని పలు ఎరువులు, పురుగుమందు దుకాణాలను శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. శ్రీ విజయలక్ష్మి, శ్రీ వేణుగోపాల, శ్రీ రామ ట్రేడర్స్ ఎరువులు, పురుగు దుకాణాల్లో దస్త్రాలకు, నిల్వలకు వ్యత్యాసం ఉండటంతో సరకుల విక్రయాలను నిలుపుదల చేయాల్సిందిగా నోటీసులు జారీ చేశామని విజిలెన్స్ సీఐ రవి బాబు తెలిపారు. ఈ తనిఖీల్లో డీసీటీవో పి. రామారావు, హెడ్‌కానిస్టేబులు రవికుమార్, మండల వ్యవసాయాధికారిణి నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.



పెద్దదోర్నాల : దస్త్రాలను పరిశీలిస్తున్న తనిఖీ బృందం అధికారి బాలాజీనాయక్



పుల్లలచెరువులోని ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా.. కనిగిరి : 8008574114, దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

పీసీపల్లి, న్యూస్‌టుడే:

సమస్య: పీసీపల్లి సచివాలయంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన సెక్యూరిటీ పత్రాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జనన, మరణ, 1బీ, అడంగళ్, కుల, ఆదాయ ధ్రువపత్రాలకు జారీ చేసే పత్రాలు అందుబాటులో లేవు. వాటిని త్వరగా కార్యాలయంలో అందుబాటులో ఉంచాలి.

–గ్రామస్థులు

సమాధానం : ఉన్నతాధికారులకు తెలియజేశాం. త్వరగా అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

–వెంకట నారాయణ, పంచాయతీ కార్యదర్శి పీసీపల్లి

కనిగిరి

• కనిగిరి • దర్శి • కొండపి

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

పామూరు, న్యూస్‌టుడే: మండలంలోని 25 పంచాయతీల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక జరుగుతుందని ఎంపీడీవో బి.సురేష్ తెలిపారు. గ్రామాల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందాలు ఈ నెల 4న నుంచి శుక్రవారం వరకు తనిఖీచేసి గుర్తించిన అంశాలపై బహిరంగ ప్రజావేదిక జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

29న ఉద్యోగ మేళా

దర్శి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం సంయుక్తంగా ఈ నెల 29న దర్శి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వెంకటరమణ శుక్రవారం తెలిపారు. ఇంటర్ నుంచి పీజీ వరకు చదివి, 19 నుంచి 30 ఏళ్ల వయసు కలిగిన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

నైపుణ్యాల వెలికితీత

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రతిభా పాటవ పోటీలు దోహద పడతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సింగరాయకొండలోని గురుకుల పాఠశాల, దర్శి మండలం పోతవరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 'ఇంటర్నెట్ వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొని తమ రచనా సామర్థ్యాన్ని పరీక్షించుకున్నారు. కనిగిరి ఉన్నత పాఠశాల నుంచి పి.సోనీ, ఎం.ఆనంద్, బి.గౌతంరెడ్డిలు విజేతలుగా నిలిచారు. వీరికి పీసీపల్లి ఎంఈవో రాచగుండ్ల శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.సంజీవి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.కోటిరత్నం, నరసింహారావు, బాలచంద్ర, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు. సింగరాయకొండ గురుకుల పాఠశాల నుంచి ఎస్.నాగజ్యోతి, జి.నిఖిత, జె.సోఫియాఏంజల్‌లు ప్రతిభ చాటారు. ప్రిన్సిపల్ రమాదేవి, ఉపాధ్యాయినులు మనోజ్ఞ, ఖాసింబీ చేతుల మీదుగా వారికి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. పోతవరం పాఠశాల నుంచి ఎస్.గురుప్రసన్న, బి.పావని, పి.నానిలు విజేతలుగా నిలిచారు. వారికి హెచ్‌ఎం వెంకటేశ్వర్లు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు లివింగ్‌స్టన్, విజయభాస్కరరెడ్డి, నారాయణ, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

–న్యూస్‌టుడే, కనిగిరి, సింగరాయకొండ గ్రామీణం, దర్శి



కనిగిరి: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు, హెచ్‌ఎం సంజీవి, ఉపాధ్యాయులు



సింగరాయకొండ: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ రమాదేవి, ఉపాధ్యాయినులు



దర్శి: బహుమతులు అందుకున్న విద్యార్థులతో పోతవరం పాఠశాల ఉపాధ్యాయ బృందం

ఈత సరదా.. కారాదు విషాదం

- వర్షాలతో నిండు కుండల్లా జలవనరులు
- చెరువులు, కుంటల్లోకి విద్యార్థులు దిగకుండా జాగ్రత్తలు అవసరం

న్యూస్‌టుడే, కనిగిరి

కరవు సీమ కనిగిరిలోని కుంటలు, చెరువులు ఇటీవల కురిసిన వర్షాలకు జలకళను సంతరించుకున్నాయి. ఈ నీటిని చూస్తున్న విద్యార్థులు అందులో దిగి ఈత కొట్టాలని తహతహలాడుతున్నారు. సెలవు రోజుల్లో అయితే కొందరు ఇంట్లో చెప్పకుండానే వీటి వద్దకు వచ్చి విన్యాసాలు చేస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లోనే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సెలవుల్లో పిల్లలు చెరువుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అయిదేళ్లలో 30 మందికి పైగా మృత్యువాత..

వెలిగండ్ల మండలం పాలేటివాగులో ఇద్దరు, కనిగిరి మండలం ఏరువారిపల్లిపల్లి, పేరంగుడిపల్లిలో నలుగురు, కనిగిరి పట్టణంలో అయిదుగురు జలవనరుల్లో మునిగి గతంలో ప్రాణాలు కోల్పోయి కన్నవారికి కడుపుకోత మిగిల్చారు. ఇలా కనిగిరి రెవెన్యూ డివిజన్‌లోని 13 మండలాల పరిధిలో అయిదేళ్ల కాలంలో 30 మందికి పైగా విద్యార్థులు, యువకులు చెరువులు, వాగులు, వంకల్లో మునిగి మృత్యువాత పడ్డారు. గ్రామాల పక్కనే వాగులు, చెక్‌డ్యాంలు, చెరువులు, కుంటలు, బావులు అధికంగా ఉన్నాయి. ఒక్క రోజు సెలవు దొరికినా, లేకుంటే కొద్ది సేపు సమయం చిక్కినా సరే ఇంట్లో అమ్మానాన్నలకు చెప్పకుండా స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కొందరు ఈత రాక, నీళ్లలో మునిగి ప్రాణాలు కోల్పోతున్నారు. మరోవైపు చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలు, దొరువుల వద్ద రక్షణ వలయాలు లేకపోవడం కూడా ప్రమాదాలకు అవకాశం కల్పిస్తోంది.

ఓ కంట కని పెట్టాల్సిందే...

ప్రస్తుతం నీటి వనరులు కళకళలాడుతున్నాయి. వీటిలో స్నానాలు చేసేందుకు, ఈత కోసం విద్యార్థులు స్నేహితులతో కలిసి సరదాగా దిగుతున్నారు. సెలవుల్లో తమ పిల్లలు ఎటు వెళ్లారు, ఏం చేస్తున్నారనే విషయాన్ని తల్లిదండ్రులు గమనిస్తుండాలి. చెరువుల వద్దకు వెళ్లే సమయంలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి. తాము ఎక్కడికి వెళ్తున్నారో ఇంటివద్ద చెప్పి వెళ్లేలా చూసుకోవాలి. తెలిసీతెలియని వయసులో స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లడం అంత శ్రేయస్కరం కాదనే విషయాన్ని పిల్లలకు వివరించి చెప్పాలి. యువకులైన ఈతకు వెళ్లే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంపొందించుకోవాలి. పురాతన బావులు, చెరువుల్లో దిగకపోవడమే మేలు, ఇలాంటి వాటిలో బురద, నీటిమొక్కలు తీగలు ఉండి చిక్కుకు పోయే ప్రమాదం ఉంది.



బొగ్గులగొంది కాలనీ వద్ద చెక్‌డ్యాంలో దూకుతున్న బాలురు

వీలైనంత త్వరగా ఆసుపత్రిలో చేర్చాలి..

నీట మునిగిన వారిని బయటకు తీసిన తర్వాత వారికి గాలి తగిలేలా చూడాలి. శ్వాస ఆడేందుకు నోటి ద్వారా గాలి ఊది శ్వాస పక్రియను మెరుగు పర్చాలి. వెల్లకిలా పడుకోబెట్టి తలను ఎడమవైపు తిప్పి పెట్టి శరీరంలోకి చేరిన నీటిని బయటకు వచ్చేలా ఏర్పాటు చేయాలి. వీలైనంత త్వరగా సమీపంలోని వైద్యశాలకు తీసుకెళ్లి ఆక్సిజన్ అందించాలి. ఈ లోపు గాలి తగిలేలా శ్వాస తీసుకునేలా చూడాలి.

– డాక్టర్ సృజన, డిప్యూటీ డీఎంహెచ్‌వో, కనిగిరి

పెద్ద చెరువులో ఆక్రమణల పరిశీలన

ఈనాడు కథనానికి స్పందన

కనిగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని పెద్ద చెరువు ఆక్రమణలపై శుక్రవారం 'ఈనాడు'లో ' పెద్ద చెరువులో దొంగలు పడ్డారు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వీఆర్వోలు శ్రీకాంత్ రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సర్వేయర్ రమేష్‌లు చెరువు ఆక్రమణలను పరిశీలించారు. మొత్తం ఎంత విస్తీర్ణం ఉండాలి.. ఎంత వరకు ఆక్రమణలు జరిగాయనే విషయాన్ని రెండు రోజుల్లో కొలతలు వేయిస్తామన్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మున్సిపల్ కమిషనర్, ఏఈలదేనని వీఆర్వోలు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్నందున సంబంధిత అధికార్లు జోక్యం చేసుకుని భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు.



చెరువును పరిశీలిస్తున్న వీఆర్వోలు, శ్రీకాంత్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సర్వేయర్ రమేష్

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

దర్శి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. స్థానిక లంకోజనపల్లి రోడ్డులో తన నివాసం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో తెదేపా నియోజకవర్గ బాధ్యురాలు గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుతో కలిసి పంపిణీ చేశారు. చవలం సీతారామయ్యకు రూ.2 లక్షలు, పోకూరి నాగపావనికి రూ.35,538, బి.శివకు రూ.30,786 ల చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో అయిదు మండలాల తెదేపా అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

తెదేపా సభ్యత్వంతో భరోసా..

తెలుగుదేశం సభ్యత్వం తీసుకున్నవారికి ఒక ధైర్యం, భరోసా ఉంటుందని గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఈ నెల 26 నుంచి ప్రారంభమయ్యే పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని తన నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మృతి చెందిన కార్యకర్తలకు రూ.5 లక్షలు బీమా అందజేయడం భరోసా కల్పించడమేనని తెలిపారు. దర్శి నియోజకవర్గంలో గతంలో కంటే రెట్టింపు సంఖ్యలో సభ్యత్వ నమోదుకు నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డా.లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే పాపారావు, నగర పంచాయతీ ఛైర్మన్ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



మహిళకు చెక్కు అందజేస్తున్న గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పాపారావు

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థులు ఎంపిక

దొనకొండ, న్యూస్‌టుడే: దొనకొండలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు కల్యాణి తెలిపారు. కందుకూరులో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో చందన, నాగమణి, మౌనిక, నాగమల్లేశ్వరి అనే విద్యార్థినులు సత్తా చాటారన్నారు. నవంబర్ 2వ తేదీన శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. ◗ **పామూరు, సి.ఎస్.పురం:** సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి నెట్ బాల్, త్రో బాల్ పోటీల్లో సి.ఎస్.పురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నెట్ బాల్‌లో విష్ణు, హరి, త్రో బాల్‌లో గౌతమ్, దీపక్‌లు ఎంపికయ్యారు. పీడీ వంశీకృష్ణను, విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని షేక్ ఖాదరున్నీసా బేగం, ఉపాధ్యాయులు అభినందించారు. ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన అండర్-14, 17 జిల్లా స్థాయి ఆటల పోటీల్లో కంభాలదిన్నె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీ పోటీలకు కె.జగన్, ఎం.మనీషా, అండర్-14 సైక్లింగ్‌లో వై.ప్రవీణ్‌కుమార్, ఎం.భవ్యజశ్విత ఎంపికయ్యారు. పీడీ నరసింహారావు, విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పఠాన్ మహబూబ్ ఖాన్ అభినందించారు.



దొనకొండ: ఎంపికైన విద్యార్థినిలు చందన, నాగమణి, మౌనిక, నాగమల్లేశ్వరి

బాణసంచా గోదాము తనిఖీ

కొండపి గ్రామీణం: మండలంలోని చిన్నకండ్లగుంట గ్రామ శివారులో ఏర్పాటు చేసిన బాణసంచా గోదాము తహసీల్దారు మురళి శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని పత్రాలు ఉండాలని తెలిపారు. చుట్టూ ప్రహరీ, రేకులు ఏర్పాటు చేయాలని యజమానులకు సూచించారు. ఆయన వెంట అగ్నిమాపక అధికారి సీహెచ్ వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుతప్పితే.. ప్రమాదమే..!



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండపి నియోజకవర్గంలోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. రోడ్లపైకి సైతం నీళ్లు రావడంతో ప్రయాణికులు, వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాగులపై ఉన్న చప్టాలపై రక్షణ గోడలు దెబ్బతినడంతో వాగు దాటే క్రమంలో చిన్న పొరపాటు జరిగినా ప్రమాదం పొంచి ఉంది. కొండపి నుంచి మద్దులూరు మీదుగా ఒంగోలు వెళ్లే రహదారిలో అట్లేరు, మూసి వాగు చప్టాలు రెండు చోట్ల ఉన్నాయి. వీటిని నిర్మించి 30 సంవత్సరాలు దాటింది. వీటిపై రక్షణ గోడలు పూర్తిగా దెబ్బతినడంతో వాహనచోదకులు వాగులు పొంగే సమయంలో భయాందోళనకు గురవుతున్నారు. వీటిని వెంటనే మరమ్మతులు చేయించాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు. అట్లేరు చప్టా ఇప్పటికే దెబ్బతిని ఊచలు బయటకు వస్తున్నాయి. ఈ విషయంపై కొండపి ర.భ.శాఖ ఏఈఈ దీప్తిని వివరణ కోరగా.. రక్షణ గోడలు, చప్టాలపై రోడ్డును మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

–న్యూస్‌టుడే, కొండపి గ్రామీణం

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పలు మండలాల్లో శుక్రవారం విద్యార్థులకు పోలీసు విధులపై అవగాహన కల్పించారు. కనిగిరి పోలీస్ స్టేషన్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్ చంద్ర ప్రారంభించారు. ఆయనతోపాటు, కనిగిరి, హనుమంతునిపాడు, పీసీపల్లి ఎస్సైలు టి.శ్రీరామ్, మాధవరావు, కోటయ్యలు రక్తదానం చేశారు. సీఐ షేక్ ఖాజావలి, మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ తదితరులు పాల్గొన్నారు. ◗ వెలిగండ్ల పోలీస్‌స్టేషన్‌లో 30 మంది విభిన్న ప్రతిభావంతులకు దుప్పట్లు, విద్యా సామగ్రిని ఎస్సై మధుసూదన్‌రావు పంపిణీ చేశారు. ఎంఈవోలు దాసు ప్రసాద్, డి.రామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ◗ ముండ్లమూరు పోలీసుస్టేషన్‌లో పోలీసు విధులు, వివిధ పరికరాలు, సీసీ కెమెరాల పనితీరుపై ఎస్సై వై.నాగరాజు స్థానిక పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. ముండ్లమూరు పోలీసు స్టేషన్ పరిధిలో మూడు సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వారికి రికవరీ చేసి అందించారు. పోలీసు స్టేషన్‌ను దర్శి సీఐ వై.రామారావు సందర్శించి రికార్డులు పరిశీలించారు. ◗ సి.ఎస్.పురం పోలీస్ స్టేషన్‌ను స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు సందర్శించారు. హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ వారికి అనేక విషయాలపై అవగాహన కల్పించారు. ◗ తాళ్లూర్లు పోలీసు స్టేషన్‌ను స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ఎస్సై, ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్ విధుల గురించి వారికి వివరించారు. ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

–న్యూస్‌టుడే, కనిగిరి, వెలిగండ్ల, ముండ్లమూరు, తాళ్లూరు



తాళ్లూరు: పోలీసుస్టేషన్ వద్ద విద్యార్థులతో ఎస్సై మల్లికార్జునరావు



కనిగిరి: రక్తదానం చేస్తున్న జడ్జి భరత్‌చంద్ర, ఎస్సైలు శ్రీరామ్, మాధవరావు, కోటయ్య తదితరులు

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

దర్శి, న్యూస్‌టుడే: దర్శి సర్కిల్ పరిధిలో నేర కార్యకలాపాలపై పూర్తి స్థాయిలో నిఘా ఏర్పాటు చేశామని, అలాంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి రాకపోకలు సాగించే వారిపై జులుం ప్రదర్శించడం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి వారి జీవనానికి భంగం కలిగించటం, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించటం, జూదం, కోడి పందేలు వంటివి నిర్వహించటం ద్వారా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే తీవ్ర చర్యలు ఉంటాయన్నారు. గతంలో జూదం ఆడినవారిని ఇప్పటికే గుర్తించామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాయితీ విత్తనాలకు పేర్ల నమోదు

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ నెల 28 నుంచి రాయితీతో శనగ విత్తనాలు కావాల్సిన రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎర్ర శనగలు, తెల్ల శనగలు ప్రభుత్వం 25% రాయితీతో అందిస్తుందన్నారు. రైతులు ఆధార్, పొలం పాసు పుస్తకం, ఫోన్ నెంబర్‌తో గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

వెలిగొండ పూర్తికి నిధులివ్వాలి

దర్శి, న్యూస్‌టుడే: వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడానికి అవసరమైన నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ డిమాండ్ చేశారు. స్థానిక గుజ్జుల సరళాదేవి భవన్‌లో పార్టీ నియోజకవర్గస్థాయి సమితి సమావేశం శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు వరప్రసాదం లాంటి వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం చివరి దశలో ఉందని, దీన్ని పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలని కోరుతూ ఈ నెల 28న తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ విషయంపై ఇప్పటికే మంత్రి రామానాయుడును కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి రమేష్‌బాబు, బాలయ్య, వీరాంజనేయులు, అంజిరెడ్డి, హనుమంతరావు, కోటేశ్వరరావు, కరుణానిధి, అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ

ఫిర్యాదులొస్తే రేషన్ డీలర్లపై చర్యలు

ముండ్లమూరు, న్యూస్‌టుడే: రేషన్ కార్డుదారులకు సరకులు సక్రమంగా అందించాలని ఇన్‌ఛార్జి తాహసీల్దారు శ్రీకాంత్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ.. డీలర్లపై ఎలాంటి ఫిర్యాదు అందినా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. నిర్ణీత సమయంలో సరకులు అందించాలని సూచించారు. ◗ సి.ఎస్.పురం: మండలంలోని చౌకదుకాణాల డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు సమన్వయంతో కార్డుదారులకు నిత్యావసర వస్తువులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి, పౌరసరఫరాలశాఖ ఎన్ఫోర్స్‌మెంట్ ఉప తహసీల్దార్ రమేష్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రేషన్ డీలర్ల సమావేశాన్ని వారు నిర్వహించారు.

నాయీ బ్రాహ్మణుల హర్షం

కనిగిరి, న్యూస్‌టుడే: దేవాలయాల పాలక మండళ్లలో నాయీ బ్రాహ్మణులకు స్థానం కల్పిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇటీవల మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయం పట్ల కనిగిరిలోని ఆ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకుడు కనిగిరి మనోహరరావు మాట్లాడుతూ.. నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చింతలపూడి వాసు, తిరిపాలు, రవికుమార్, నారాయణ, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నెలలపాటు పశుగణన

సి.ఎస్.పురం: అఖిల భారత 21వ పశుగణన నాలుగు మాసాల పాటు జరుగుతుందని డీజీపేట పశువైద్యాధికారి షేక్ మునీర్ శుక్రవారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మొత్తం 16 విభాగాల్లో పశువుల వివరాలను పూర్తి డిజిటల్ పద్ధతిలో నమోదు చేయనున్నట్లు చెప్పారు. మండలంలోని 13,025 కుటుంబాలకు సంబంధించి పశుగణన వివరాలను సేకరిస్తామన్నారు. ప్రతి 2 వేల కుటుంబాలకు ఒక గణకుడిని నియమించినట్లు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: భూ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తుందని.. సత్వరమే పరిష్కార మార్గం చూపుతామని తహసీల్దార్ రవి తెలిపారు. మండలంలోని శానంపూడిలో శుక్రవారం భూ రీసర్వేలో తలెత్తిన తప్పులు, సమస్యలపై రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామస్థుల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొత్తం 60 అర్జీలు వచ్చాయని, ఎక్కువ శాతం భూ సమస్యలపైనే అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ బ్రహ్మం, స్థానిక సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ రవి

కృత్రిమ కొరత.. అన్నదాత కలత

- ◗ డీఏపీ బస్తాపై అదనంగా రూ.150 వసూలు
- ◗ అధికారులు స్పందించాలని రైతుల వినతి

న్యూస్‌టుడే, టంగుటూరు

ఆరుగాలం శ్రమించే అన్నదాతకు ఎరువుల కృత్రిమ కొరత శాపంగా మారింది. పంటల సాగుకు సన్నద్ధమయ్యే వేళ రైతుల గుండెల్లో గుబులు రేపుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనులకు సమాయత్తమవుతున్నారు. అందుకు కావాల్సిన ఎరువుల కోసం దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో డీఏపీకి భారీగా డిమాండ్ ఏర్పడింది. రిటైల్ ఎరువుల దుకాణదారులు బస్తాపై అదనంగా రూ.150 వసూలు చేస్తున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సక్రమంగా ఎరువులు అందేలా చూడాలని అంతా కోరుతున్నారు.

నిల్వలు లేవని చెబుతూ..

టంగుటూరు మండలంలో అత్యధిక మంది రైతులు పొగాకు, శనగ పంటలను సాగుచేస్తారు. ఏటా 7 వేల హెక్టార్లలో పొగాకు, 2 వేల హెక్టార్లలో శనగ పంట వేస్తారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో వీటి సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. హోల్‌సేల్ దుకాణాల్లో 50 కేజీల డీఏపీ బస్తా రూ.1,350ల ఎమ్మార్పీకి విక్రయిస్తారు. నిల్వలు ఉన్నప్పటికీ ఇవ్వకుండా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఎకరా పొగాకు సాగుకు 75 కేజీల వరకు డీఏపీ వినియోగిస్తుంటారు. బ్లాక్ మార్కెట్‌లో బస్తాకు అదనంగా రూ.150లు తీసుకొని విక్రయిస్తున్నారు. ప్రస్తుతం టంగుటూరు మండల మార్కెట్‌లో ఈ పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం ఆర్బీకేలను ఏర్పాటు చేసి చిన్న, సన్నకారు రైతులకు ఆదరువుగా నిలిచే సొసైటీలను పట్టించుకోలేదని అన్నదాతలు వాపోతున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు స్పందించి డీఏపీ ఎరువు కొరత లేకుండా చూడాలని, బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్న అధిక ధరలకు కళ్లెం వేయాలని రైతులు కోరుతున్నారు.



జమ్ములపాలెంలోని రైతు సేవా కేంద్రం

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం..

మండలం పరిధిలోని సొసైటీల్లో 140 టన్నుల డీఏపీ నిల్వలు ఉన్నాయి. టంగుటూరు సొసైటీలో 12, కొణిజేడు సొసైటీలో 36 టన్నుల వరకు ఉంది. ప్రస్తుతం అన్నీ సొసైటీల్లో అందుబాటులో ఎరువులు ఉన్నాయి. కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని ఇటీవల సమావేశంలో దుకాణదారులకు తెలియజేశాం. అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణాలపై రైతులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. డీఏపీ కావాల్సిన రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకుడిని సంప్రదించాలి.

–స్వర్ణలత, మండల వ్యవసాయాధికారిణి, టంగుటూరు

విద్యార్థిని చికిత్సకు ఆర్థిక సాయం

వెలిగండ్ల: వెలిగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రత్నకుమారి అనే విద్యార్థిని దసరా సెలవుల్లో పాముకాటుకు గురైంది. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొగ్గారపు రాఘవచారి, ఉపాధ్యాయులు వెలిగండ్లలోని ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించి వైద్య చికిత్స ఖర్చుల నిమిత్తం కోసం రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

పిల్లలతో కలిసి వివాహిత అదృశ్యం

పొన్నలూరు: మండలంలోని పెద్దవెంకన్నపాలెం గ్రామానికి చెందిన తన్నీరు అంకమ్మ.. తన కొడుకు, మనవరాళ్లు కనిపించడం లేదని ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనూక్ తెలిపారు. అంకమ్మ, ఆమె భర్త పనికి వెళ్లి వచ్చే సరికి కోడలు, మనవరాళ్లు కనిపించలేదని పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

(c) eenadu

ఒంగోలు

•ఒంగోలు •సంతనూతలపాడు

సత్తా చాటారు.. బహుమతులు పట్టారు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న పీవీఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఈనాడు ఆధ్వర్యంలో చేపట్టిన ప్రతిభాపాటవ పోటీల్లో భాగంగా శుక్రవారం స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8,9,10 తరగతులకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై విద్యార్థులు తమకు ఎదురైన అనుభవాలు, అంతర్గాలు కలిసే నష్టాలను వివరించారు. విద్యార్థులు ఎన్.మధుకిరణ్(10 తరగతి), సీహెచ్ చమన్‌సాయి(8వ తరగతి), కె.ప్రవీణ్‌కుమార్(8వ తరగతి)లు ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రాధికలు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్.స్టాలిన్, పి.అరుణశ్రీ, టి.కోమలీదేవి, జి.రామయ్య, డి.శ్రీలక్ష్మి, ఎన్.నాగమణి పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన


ప్రథమ చికిత్స విధానాల గురించి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చీమకుర్తి,న్యూస్‌టుడే: గ్రానైట్ క్వారీల్లో పనిచేసే సిబ్బంది, కార్మికులు గాయపడిన సమయంలో చేయాల్సిన ప్రథమ చికిత్సా విధానాలు గురించి కార్మికులకు అవగాహన కల్పించారు. గ్రానైట్ గనుల్లో భద్రతా వారోత్సవాల్లో భాగంగా రామతీర్థంలోని వృత్తి శిక్షణా కేంద్రంలో గత కొద్ది రోజులుగా ట్రేడ్ పరీక్షలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా శుక్రవారం ప్రథమ చికిత్స విధానాల అమలు గురించి పరీక్షలు నిర్వహించారు.

జలం అందక.. గొంతులు తడవక

జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉంది. నేరుగా సాగరు నీరు వచ్చే అవకాశం ఉంది. 200 ఎకరాల చెరువు సైతం దాని సొంతం. కానీ ఏళ్లుగా తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. కనీసం వాడుక నీరు సైతం సక్రమంగా వస్తున్నా దాఖలాలు లేవు. ఇవీ పేర్నమిట్టలో తిష్టవేసిన సమస్యలు. ఆ ప్రాంత ప్రజలకు సక్రమంగా నీరు అందక నానా అవస్థలు పడుతున్నారు. చివరకు ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారు.

❖ పేర్నమిట్టలో నీటికి కటకట
❖ పట్టించుకోని అధికారులు

ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే:

గ్రామంలో ఎక్కడా బోరు వేసినా ఉప్పు నీరే పడుతుంది. చెరువు కట్ట సమీపంలో వేసిన ఆరు బోర్లతో గ్రామంలోకి నీటి సరఫరా జరుగుతుంది. మంచినీటి ట్యాంకు పాడవ్వడంతో నేరుగా గ్రామంలోకి నీటి సరఫరా జరుగుతుంది. అదీ ప్రతి నాలుగు రోజులకోసారి. ఇవి కూడా కేవలం వాడుకకు మాత్రమే. గ్రామంలో ఎప్పుడో 30 ఏళ్ల క్రితం పైపులైను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కొత్తగా వేసింది లేదు. ఫలితంగా పైపులైన్ పూర్తిగా దెబ్బ తింది. ఎక్కడా చూసినా లీకుల రూపంలోనే నీరంతా వృథాగా పోతుంది. ఎత్తు ప్రాంతాలకు అసలు నీరే అందడం లేదు.


చెరువు వద్ద గ్రామంలో పోసేందుకు నీటిని పట్టుకుపోతున్న ట్యాంకర్లు


పేర్నమిట్ట గ్రామంలో నీటిని సరఫరాకు ఏర్పాటు చేసిన బోరు

చెరువును అందుబాటులోకి తెస్తే..

గ్రామంలో 200 ఎకరాల్లో మంచినీటి చెరువుంది. చెరువులోకి నేరుగా సాగర్ నీరు వచ్చే అవకాశం ఉన్నా ఆ దిశగా అడుగులు పడడం లేదు. ఈ ప్రాంతంలోని 100 ఎకరాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. గతంలో అధికారులు సైతం పరిశీలించారు. కానీ ఇప్పటికీ అది అమలుకు నోచుకోలేదు. గ్రామంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఏర్పాటు చేస్తే పేర్నమిట్టతో పాటు ఒంగోలుకు సైతం తాగు నీటిని అందించే అవకాశం ఉంది. మరోవైపు చెరువు ఆక్రమణలకు సైతం గురవుతోంది. ఎవరూ పడితే వారు చెరువును, కట్టను ఆక్రమించి నిర్మాణాలు చేయడం, సాగు చేసుకోవడం పరిపాటిగా మారింది. పాలకులు పట్టించుకుని చెరువును బాగు చేసి స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటు దిశగా అడుగులు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ట్యాంకర్లే దిక్కు..


లీకేజీ రూపంలో పోతున్న నీరు

గ్రామంలో చాలా ప్రాంతాలకు పైపులైను లేకపోవడంతో ట్యాంకర్ల నీరే దిక్కుగా మారింది. పేర్నమిట్టతో పాటు, రెడ్డినగర్, సరళాదేవి నగర్, పేర్నమిట్టలోని పాత, కొత్త హరిజనవాడ, శాంతినగర్, బీవీ సుబ్బయ్య పాలశాల ప్రాంతం, ద్వారకా నగర్, వైఎస్సార్ కాలనీ, ఆరుబోతుకాలనీ, పేర్లమాను, తదితర ప్రాంతాల నీటి వసతి కరవైంది. ఆ కాలనీలకు ట్యాంకర్లతో పంపితేనే నీరు. నాలుగురోజులకోసారి వచ్చే ట్యాంకర్ నీటిని పెద్ద పెద్ద డ్రమ్ముల్లో ప్రజలు నింపుకొని వాడుకుంటున్నారు. ఇక తాగేందుకు బబుల్ రూ.10 నుంచి రూ.20 వరకు ప్రైవేటు ప్లాంట్ల నుంచి కొనుగోలు చేయాల్సిందే. ప్రతి ఇంటికి బబుల్ నీటిని కొనుగోలు చేస్తున్న పరిస్థితి. గ్రామంలోకి ఒంగోలు నుంచి సైతం వచ్చి ఇక్కడ తాగు నీటి విక్రయాలు జరుగుతున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.


చీమకుర్తి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


ఎస్ఎన్‌పాడు: వ్యాస రచన పోటీలను పరిశీలిస్తున్న ఎస్సై అజయ్‌బాబు

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

మైనంపాడు (సంతనూతలపాడు), చీమకుర్తి: మైనంపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు శుక్రవారం వ్యాస రచన పోటీలను నిర్వహించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సంతనూతలపాడు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఈ పోటీలను చేపట్టారు. ఎస్సై వి.అజయ్‌బాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం, జ్ఞానాన్ని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. శాంతి భద్రతల కోసం ఎంతో మంది పోలీసులు ప్రాణాలు వదిలారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ❖ పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా 'సైబర్ నేరాల నియంత్రణలో యువత పాత్ర' అనే అంశంపై చీమకుర్తి పట్టణంలోని వివిధ పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ పవన్ కుమార్ భార్యను ఘనంగా సత్కరించారు.


కిట్లు అందుకున్న శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు

నాసా కిట్ల అందజేత

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: నగరంలోని లాయర్‌పేటలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులకు నాసా కిట్లు శుక్రవారం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇండియా నాసా కో ఆర్డినేటర్ వెంకటరమణ మాట్లాడుతూ.. నాసా ప్రయోగాలు, ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జోసఫ్ తంబి, ఆర్ఐ అనిల్, పర్యవేక్షకులు జి.శ్రీనివాసరావు, డీన్ బాలసుబ్రహ్మణ్యం, నాసా ప్రోగాం ఇన్‌ఛార్జి మధుస్మిత, తదితర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నేటి నుంచి వీహెచ్‌పీ శిక్షణా కార్యక్రమాలు

మద్దిపాడు: విశ్వహిందూ పరిషత్తు(వీహెచ్‌పీ) శిక్షణా కార్యక్రమాలు శనివారం నుంచి నిర్వహించనున్నట్లు ఈ సంస్థ ప్రతినిధి సోమా సుబ్బారావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. విశ్వహిందూ పరిషత్తు దక్షిణాంధ్ర ప్రాంత సత్సంగ శిక్షణా వర్గం ప్రతినిధులు రెండు రోజులపాటు మల్లవరం గ్రామంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి, కేంద్రస్థాయి ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

చవుడు నేలల్లో పొగాకు పండించొద్దు

మద్దిపాడు, న్యూస్‌టుడే: లోతట్టు, చవుడు నేలల్లో పొగాకు పంటను పండించొద్దు అని వెల్లంపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి రామకృష్ణ సూచించారు. మండలం పరిధిలోని కొలచనకోట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పొగాకు పంట నియంత్రణ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వర్షాలకు పొగాకు నర్సరీ యాజమాన్యాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో రైతు నాయకులు కంపెనీ ప్రతినిధులు ఐటీసీ, జీపీఐ బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న లారీ పట్టివేత

మద్దిపాడు: అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న లారీని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. విజిలెన్స్ సీఐ రాఘవరావు తెలిపిన వివరాల మేరకు... గ్రానైట్ ముడిరాయితో చీమకుర్తి నుంచి గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌కు వెళ్తున్న లారీని మల్లవరం దగ్గర ఆపి అధికారులు తనిఖీ చేశారు. అక్రమంగా ముడి రాయిని తరలిస్తున్నారని గుర్తించి లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

జీజీహెచ్ ఆర్ఎంవోగా మాధవీలత

ఒంగోలు నగరం: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ బి.మాధవీలత నియమితులయ్యారు. ఆమె శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు వై.సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, బి.కృష్ణ కలసి అభినందనలు తెలిపారు.

స్వామివారికి వస్త్రాల సమర్పణ

ఒంగోలు అంజయ్యరోడ్డు: ఒంగోలుకు చెందిన హరిప్రియ అనే భక్తురాలు శుక్రవారం కుటుంబసభ్యులతో కలిసి శ్రీగిరిలో శ్రీ వెంకటేశ్వరస్వామికి మేల్ చాట్ వస్త్రాలను సమర్పించారు. శ్రీ వారికి మేల్ చాట్ వస్త్రాలను సమర్పించిన హరిప్రియకు వేదపండితులు వేద ఆశీర్వదచనం అందజేశారు.

కవి రాజేశ్వరరావుకు నివాళి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సరళమైన పదాలు, మధుర భావనలతో గొప్ప కవిత్వం రాసిన పద్య కవి మల్లవరపు రాజేశ్వరరావు అని జానుడి డైరెక్టర్ నూకతోటి రవికుమార్ కొనియాడారు. స్థానిక శ్రీనగర్ కాలనీలోని జానుడి సాహిత్య కేంద్రంలో పద్య కవి రాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు జాన్ శ్యామ్యూల్, దారా మోహన్, బ్రహ్మయ్య, సాయి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు


కొత్తపట్నం: రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మధుసూదనరావు

కొత్తపట్నం, మద్దిపాడు, సంతనూతలపాడు, న్యూస్‌టుడే: గ్రామాల్లో రీసర్వేలతో తలెత్తిన భూ వివాదాల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.మధుసూదనరావు తెలిపారు. కొత్తపట్నం మండలం పాదర్తిలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ కొలతలు, వెబ్‌ల్యాండ్‌లో విస్తీర్ణం తేడా తదితర సమస్యలపై అర్జీలు అందజేయాలన్నారు. పలు సమస్యలపై మొత్తం 112 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కట్టా సౌందర్య, డీటీ కృష్ణమోహన్, ఆర్ఐ వరకుమార్ పాల్గొన్నారు. ❖ మద్దిపాడు మండలంలోని దొడ్డవరం,గార్లపాడు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనన తహసీల్దారు సుజన్ కుమార్ ప్రజలు నుంచి అర్జీలు స్వీకరించారు. మండల సర్వేయర్ అంజలీ, తెదేపా మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, గ్రామస్థులు పాల్గొన్నారు. ❖ సంతనూతలపాడు మండలం గుమ్మళంపాడులో నిర్వహించిన గ్రామసభలో వైకాపా ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే మాకు వద్దంటూ, పాత విధానంలో సర్వే చేపట్టాలని గ్రామస్థులు నినాదాలు చేశారు. రీ సర్వే వల్ల తాము ఎంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి భూ సమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

'ఒడా ఛైర్మన్ పదవి కాపులకు కేటాయించాలి'

ఒంగోలు నగరం: ఒడా ఛైర్మన్ పదవిని జిల్లాలో కాపులకు కేటాయించాలని జనసేన నాయకులు కోరారు. శుక్రవారం డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనసేన జిల్లా ప్రచార కమిటీ సమన్వయకర్త జడా బాలనాగేంద్ర యాదవ్ మాట్లాడుతూ.. కూటమి తరపున గెలిచిన ప్రజాప్రతినిధులు ఇందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో కూడా ఒడా ఛైర్మన్ పదవి కాపులకు కేటాయించినందున ఆ సాంప్రదాయాన్ని కొనసాగించాలని కోరారు. పార్టీ నాయకులు గొర్రెపాటి శ్రీనివాసరావు, గోలి తిరుపతిరావు సమావేశంలో పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుతో కుటుంబానికి భరోసా


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు అంటే అది కేవలం గుర్తింపు మాత్రమే కాదని, అది ఒక కుటుంబానికి భరోసా లాంటిదని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి నియోజకవర్గ పార్టీ క్లస్టర్, యూనిట్, ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.100తో తెదేపా సభ్యత్వ నమోదు తీసుకుంటే, రెండేళ్లపాటు రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం ఉండనున్నట్లు తెలిపారు. సమావేశంలో తెదేపా నాయకులు మంత్రి శ్రీనివాసరావు, వైవీ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు గ్రామీణం: జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ నెల 26 నుంచి తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఒంగోలులోని తెదేపా కార్యాలయంలో శనివారం ప్రారంభించనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హాజరు కానున్నారు.

పశు గణనలో సమగ్ర సమాచారం సేకరించాలి


పశు గణన సర్వేను ప్రారంభిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, చిత్రంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి బేబిరాణి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఫిబ్రవరి నెలాఖరులోపు జిల్లాలోని ప్రతి ఇంటిని సందర్శించి, పశుగణన సమగ్ర సమాచారాన్ని సేకరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో స్థానిక క్యాంపు కార్యాలయంలోని కలెక్టర్ నివాసం నందు శుక్రవారం పశుగణన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి బేబి రాణి పాల్గొన్నారు.

యల్లయ్య నగర్‌లో పారిశుద్ధ్య పనులు

స్పందనకు వందనం

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి మండలం బూదవాడ పంచాయతీ యల్లయ్య నగర్‌లో శుక్రవారం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ గ్రామంలో డెంగీ జ్వరం కేసు నమోదైన విషయమై శుక్రవారం ఈనాడులో ప్రచురితమైన వార్తతో పంచాయతీ వారు స్పందించారు. మురుగు కాలువలను శుభ్రం చేయించారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి రక్తనమూనాలు సేకరించారు. సర్పంచి జె.మరియమ్మ, కార్యదర్శి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

వినికిడి యంత్రాల పంపిణీ

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: వైద్యఆరోగ్యశాఖ, దీన దయాళ్ శ్రవణ ఫౌండేషన్ సహకారంతో స్థానిక జీజీహెచ్‌లో ఉచితంగా వినికిడి యంత్రాల పంపిణీ చేపట్టారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్ నేతృత్వంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వైద్యులు 92 మంది పిల్లలు, 132 మంది పెద్దలకు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి వినికిడి యంత్రాలు అందజేశారు. బాలస్వాస్థ్య విభాగం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ భగీరథ, సంస్థ ప్రతినిధి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరుల పరిశీలన

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ప్రజారోగ్య విభాగం ఎస్ఈ మోహన్ (నెల్లూరు) శుక్రవారం నగరంలోని నీటి వనరులను పరిశీలించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద నుంచి ఒంగోలు వేసవి చెరువులకు వేసిన పైపులైన్‌ను పరిశీలించారు. అనంతర కర్నూలురోడ్డు పాత రంగుల ఫ్యాక్టరీ వద్ద నిర్మాణంలో ఉన్న ఫిల్టరేషన్ ప్లాంటు, ఓవర్‌హెడ్ ట్యాంకులను చూసి పనుల ప్రగతి గురించి ఆరా తీశారు. అనంతరం కమిషనర్ కె.వెంకటేశ్వరరావుతో నీటి సరఫరాపై చర్చించారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్లు అయిన ప్రకాశం జిల్లా, దొనకొండ మండలం, మంగినపూడి గ్రామ నివాసం శ్రీ **రాచగొర్ల వెంకటయ్య** గారి కుమార్లు **(1) నారాయణ మరియు (2) అశోక్‌బాబు** అనువార్లు మాకు యిచ్చిన సూచనల మేరకు యావన్మందికి తెలియజేయునది..

లోగా తే. **09.04.2008**దిన **షేక్ పరహానా బేగం మరియు షేక్ మహమ్మద్ రసూల్** అనువారల వల్ల అస్వాధీనపు విక్రయ ఖరారు అగ్రిమెంటుతో కూడిన జి.పి.ఏ పొందిన ఏజెంట్లు శ్రీ **కర్ను శ్రీనివాసరెడ్డి** మరియు శ్రీ **కొల్లూరి వెంకటేశ్వరరావు** వద్ద నుండి మా క్లయింట్లు తండ్రి గారైన శ్రీ **రాచగొర్ల వెంకటయ్య** గారు కొనుగోలు చేసి ఒంగోలు స.రి వారి ఆఫీసులో **దస్తావేజు నెం. 2314/2008రుగా** రిజిష్టరు కాబడి సదరు దస్తావేజుకు తే. 14.11.2018దిన పై వారి వద్ద నుండి సవరణ దస్తావేజు పొంది ఒంగోలు స.రి వారి ఆఫీసులో **ద.నెం. 9829/2018రుగా** రిజిష్టరు పొంది వారికి హక్కు కలిగి వారి స్వాధీనానుభవములో కలిగి నిర్వివాదముగా అనుభవించుచున్న ఆస్థిని గురించి మా క్లయింట్లు పేర్లుతో తే. 13.10.2023దిన శెటిల్‌మెంట్ దస్తావేజు వ్రాయించి ఒంగోలు స.రి.వారి ఆఫీసులో మా క్లయింట్లలో **1వ వారి పేరున ద.నెం. 13759/2023రుగా** మరియు 2వ వారి పేరున **దస్తావేజు నెం. 13760/2023ర్లుగా** రిజిష్టరు కాబడిన దస్తావేజులు ద్వారా హక్కు సంక్రమించి మా క్లయింట్లు స్వాధీనానుభవములో కలిగి నిర్వివాదముగా అనుభవిస్తున్న ఆస్థిని మా క్లయింట్లు ఇతరులకు విక్రయించుటకు సిద్ధంగా ఉండియున్నారు. క్రింది షెడ్యూలు దాఖలాస్థికి సంబంధించిన లింక్ దస్తావేజులు అనగా **దస్తావేజు నెం. 2314/2008 & దస్తావేజు నెం. 9829/2018**ర్లు మా క్లయింట్లు వద్ద పోయినవి. కావున క్రింది షెడ్యూలు దాఖలాస్థిపై ఎవ్వరికైననూ ఎటువంటి అభ్యంతరములు, ఆక్షేపణలు గాని హక్కులు గాని ఉన్నయెడల ఈ ప్రకటన వెలువడిన పదిహేను (15) రోజులు లోపల వ్రాతపూర్వకమైన ఆధారములతో క్రింది అడ్రసుకు తెలియపరచవలెను. లేనియెడల సదరాస్థి నిర్వివాదమైన ఆస్థియని ధృవపరచుకొని మా క్లయింట్లు సదరాస్థిని యితరులకు విక్రయించి వారి పేరున రిజిష్టరు పత్రములు రాయగలవారు. తదుపరి సదరాస్థిపై ఎటువంటి ఆక్షేపణలు వచ్చిన యెడల అట్టివి చెల్లనేరవు మరియు మా క్లయింట్లు మరియు వారి యొక్క కొనుగోలుదార్లును బద్ధపరచజాలవు అని ఇందుములముగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు: ప్రకాశం జిల్లా - ఒంగోలు స.రి. యిలాకా - ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ లిమిట్స్ - **ఒంగోలు రూరల్ గ్రామ సర్వేనెం. 138/1రులో** పై రెండు ద.నెం. 13759/2023 మరియు 13760/2023ర్లు తాలుకు ఏకప్రదేశంగా గల **95 గదుల 62 చ.అ.లు లేక 766. 8/9 చ.గలు** ఆస్థికి హద్దులు. **తూర్పు:** టింబర్ కాంప్లెక్స్ వారి భూమి. **దక్షిణం:** నల్లు విజయ గారు విక్రయించిన ఆస్థి. **పడమర:** 40 అ॥లు వెడల్పు గల రోడ్డు. **ఉత్తరం:** దిగుమర్తి సీతమ్మ, దాసరి కొండయ్య గార్ల స్థలము.

ఇట్లు, సం/- **బొడ్డు రామలింగం, బోడపాటి శ్రీనివాసరావు**
స్థలం : ఒంగోలు అడ్వకేట్స్, డోరునెం. 8-513/జి1, బృందావన్‌నగర్,
తేది: 22-10-2024 శ్రీసాయి ఎన్‌క్లేవ్, ఒంగోలు. ఫోన్ : 9866588599

బృందావన్‌నగర్‌లో సమస్యల తిష్ట


కుంగిన బృందావన్‌నగర్‌కు వెళ్లే రోడ్డు

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే:

నగరంలోని అంజయ్యరోడ్డు నుంచి బృందావన్‌నగర్‌కు వెళ్లే మార్గంలో ఒకవైపు రోడ్డు కుంగిపోయి ప్రమాదకరంగా ఉంది. నిత్యం వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో ఏ సమయంలో పూర్తిగా కుంగిపోతుందో తెలియక వాహనదారులు ఆందోళన చెందుతున్న పరిస్థితి. ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోక ముందే దానిని తొలగించి కొత్త నిర్మాణం చేపట్టాలని వారు కోరుతున్నారు. ఇక బృందావన్ నగర్, పండరీపురం, లంబాడిడొంక పరిసర ప్రాంతాల్లో మురుగు కాలువ వ్యవస్థ ఏళ్ల కిందట నిర్మించారు. ఫలితంగా ప్రస్తుత అవసరాలకు సరిపోక మురుగు పూర్తిగా కాలువలోనే నిలిచిపోతుంది. అలాగే అర్ధరాత్రి సమయంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో దోమల బెడదతో కంటి నిండా నిద్ర కరవైందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

కమ్మపాలెం.. అభివృద్ధికి ఆమడ దూరం..

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే:

నగరంలోని 7, 8వ డివిజన్‌ల పరిధిలో ఉన్న కమ్మపాలెంలో అభివృద్ధి చూద్దామన్నా కనిపించడం లేదు. గత వైకాపా పాలకులు ఈ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేశారు. 2017-2018 మధ్యకాలంలో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.1.55 కోట్లతో కొత్తపట్నం బస్టాండ్ కూడలి నుంచి కాళికా మాత గుడి వరకు రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. అనంతరం అధికారంలోకి వచ్చినా ఒక వైపు రోడ్డు నిర్మించి అర్ధాంతరంగా ఆపేసింది. సుమారు 30 లక్షల రూపాయల పనిని మాత్రమే చేసి చేతులు దులుపుకొంది. ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డును కూటమి ప్రభుత్వం పట్టించుకొని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. తెదేపా హయాంలో ఈ డివిజన్‌లో పార్కు నిర్మాణం పనులను రూ.47 లక్షల అంచనాలతో పనులు చేపట్టారు. గత పాలకులు పూర్తిగా దీన్ని గాలికొదిలేయడంతో చిల్లచెట్లు పెరిగిన వనం కాస్తా అధ్వానంగా మారింది. సాయంత్రం కాసేపు సేద తీరుదామనుకునే ప్రజలు, చిన్నారులు పార్కు లేక ఇతర ప్రాంతాలకు పోవల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. అలాగే లో ఓల్టేజీ సమస్యతో విద్యుత్తు సరఫరాకు సైతం అంతరాయం కలుగుతోంది. గోపాల్‌నగర్ 4వ లైన్ నుంచి కమ్మపాలెం 3వ లైన్ వరకు 40 అడుగుల రోడ్డు ఉండగా.. అక్కడ 20 అడుగుల మేర రోడ్డు ఇప్పటికీ పూర్తి కాలేదు. అక్కడ రోడ్డు కోసమని భూసేకరణ చేసినా స్థల యజమానులకు డబ్బులు పరిహారం చెల్లించకపోవడం పనులు ముందుకు సాగలేదు. అధికారులు స్పందించి కమ్మపాలెం నెలకొన్న సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


కమ్మపాలెం రోడ్డు ఇలా.


పూర్తికాని పార్కు.



(c) eenadu